



# విజయభాను





విశాఖపట్నం, శనివారం 25-07-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 275 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు యథాతథం

### కేంద్ర హోంశాఖ వెల్లడి

దిల్లీ: ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం శాఖ రాష్ట్రాలకు పలు సూచనలు జారీ చేసింది. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో 'ఆత్మ నిర్భర్ భారత్'కు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపింది. దేశంలో కరోనా ఉద్ధృతి ఉన్నప్పటికీ కార్యక్రమాలను రద్దు చేయడం లేదని స్పష్టం చేసింది. సామాజిక దూరం, పారిశుద్ధ్యం పాటించడం, మాస్కులు ధరించడం కొనసాగిస్తూనే వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని బాగా ఉపయోగించుకోవాలని కేంద్రం సూచించింది. ఇటీవల వైరస్ నుంచి కోలుకున్నవారు. వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలకు ప్రత్యేక ఆహ్వానం పంపి వారిని ప్రోత్సహించాలని సూచించింది. గవర్నర్‌లు నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమం కూడా యథాతథంగా నిర్వహించుకోవచ్చని కేంద్రం తెలిపింది. కానీ.. కచ్చితంగా నిబంధలను పాటించాలని కోరింది. మిలిటరీ బ్యాండ్లు రికార్డ్ చేసిన వీడియోలను పెద్ద తెరలపై ప్లే చేయాలని సూచించింది. ఎర్రకోట నుంచి ప్రధాని ప్రసంగం ఉంటుందని.. అయితే.. పరిమిత సంఖ్యలోనే ఆహ్వానితులు ఉంటారని కేంద్ర హోం శాఖ వెల్లడించింది.

## బిల్లులపై ఏపీ గవర్నర్ న్యాయ సలహా



అమరావతి : పాలనా వికేంద్రీకరణ బిల్లు, సీఆర్‌డీఏ రద్దు బిల్లుపై గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ న్యాయ సలహాలు తీసుకుం టున్నారు. రాజ్ భవన్ అధికారులు, సీనియర్ న్యాయ వాదులతో ఆయన సమావేశమై.. అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. చర్చల అనంతరం బిల్లులపై ఆయన తుది నిర్ణయం తీసుకోనున్నారు.

గత నెల 17న శాసనసభ నుంచి రెండోసారి ఈ బిల్లులను శాసనమండలికి పంపారు. ఆ రోజు బిల్లులను ప్రవేశ పెట్టకముందే మండలి నిరవధికంగా వాయిదా పడింది. శాసనసభ నుంచి రెండోసారి మండలికి పంపినందున అక్కడ చర్చ, ఆమోదాలతో సంబంధం లేకుండా నెల రోజులకు స్వయంచాలితంగానే (ఆటోమేటిక్) ఆమోదం పొందినట్లు పరిగణిస్తారనేది రాష్ట్ర ప్రభుత్వ వాదన. గత నెల 17న మండలికి పంపిన ఈ బిల్లులకు ఈనెల 17తో ఈ వ్యవధి ముగిసిందని ప్రభుత్వం భావిస్తోంది.

అందువల్లే తుది ఆమోదానికి గవర్నర్‌కు శనివారం పంపి నట్లు చెబుతున్నారు. గత జనవరిలో తొలిసారి బిల్లులను శాసనసభలో ఆమోదించి మండలికి పంపారు. వీటిని మండలి ఛైర్మన్ అప్పట్లో సెలక్టు కమిటీకి పంపారు.

# కోవిడ్ మరణాలు తగ్గించడంపై దృష్టి పెట్టాలి

- కోవిడ్ చికిత్సకు అదనంగా రూ.1000 కోట్లు
- క్వారంటైన్ సెంటర్లలో సదుపాయాలపై దృష్టి పెట్టాలి

### కోవిడ్ సమీక్షా సమావేశంలో సీఎం వైఎస్ జగన్



తాడేపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా కరోనా బాధితుల చికిత్స కోసం అదనంగా మరో 54 ఆస్పత్రులు గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తంగా 138 ఆస్పత్రుల్లో కరోనా చికిత్స అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో అదనంగా మరో 5 ఆస్పత్రుల్లో క్రిటికల్ కేర్ సదుపాయలు కల్పించే దిశగా సాగుతున్నామని, వాటిలో ఇప్పటికే 3 ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కోవిడ్ సమీక్షా సమావేశంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అధికారులు సీఎం వైఎస్ జగన్‌కు వివరించారు.

కొత్తగా తూర్పు గోదావరి జీజీహెచ్, పశ్చిమగోదావరిలో ఆశ్రం, గుంటూరు జీజీహెచ్, అనంతపూర్ జీజీహెచ్, శ్రీకాకుళం జీజీహెచ్ ఆస్పత్రులను రాష్ట్రస్థాయి కోవిడ్ ఆస్పత్రులుగా మారుస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. తద్వారా క్రిటికల్‌కేర్ కోసం 2380 బెడ్లు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. అనంతపూర్, శ్రీకాకుళం తప్ప మిగిలిన మూడు ఆస్పత్రులనూ క్రిటికల్ కేర్ సేవలు అందించడానికి సిద్ధం చేశామన్నారు. మొత్తంగా 8 ఆస్పత్రులు క్రిటికల్ కేర్ ఆస్పత్రులుగా మార్చామన్నారు.

కాగా, వచ్చే 6 నెలల్లో అదనంగా రూ.1000 కోట్లు ఖర్చు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారులకు చెప్పారు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సిబ్బంది నియామకాల కోసం వీటిని ఖర్చు చేయాలని సూచించారు. అవసరమైన సిబ్బందిని నియమించుకుని మరణాలు తగ్గిచండంపై దృష్టిపెట్టాలని సీఎం ఆదేశించారు. రెమ్‌డెసివిర్, టోసీలిజుమబ్ వంటి మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే క్వారంటైన్ సెంటర్లలో సదుపాయాలపై దృష్టిపెట్టాలని సీఎం చెప్పారు. క్వారంటైన్ సెంటర్లలో సేవలపై ప్రతిరోజూ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వెల్లడించారు. కోవిడ్ టెస్టులు, క్వారంటైన్ సదుపాయాలకోసం రాష్ట్ర ప్రభుత్వం రోజుకు సుమారు రూ.6.5 కోట్లు చొప్పున ఖర్చు చేస్తోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు.

**రికార్డుస్థాయిలో పరీక్షలు**

రాష్ట్రంలో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు, పాజిటివిటీ అంశాలను అధికారులు ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో రోజుకు రికార్డు స్థాయిలో 58వేల పరీక్షలు చేస్తున్నామన్నారు. కంటైన్ మెంట్ క్లస్టర్లు, కోవిడ్ సోకడానికి ఆస్కారం అధికంగా ఉన్న వారిపై దృష్టి పెట్టి ఈ పరీక్షలు చేస్తున్నామని, దీనివల్ల పాజిటివ్ తరువాయి 2లో..

## ఇకపై ఉద్యోగ వివరాలకు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్..

### మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అధ్యక్షతన ఐటీ శాఖపై సమీక్ష



అమరావతి: కరోనా నేపథ్యంలో 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' శాఖ పాత్ర మరింత కీలకం కానుందని పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రోజున మంత్రి మేకపాటి అధ్యక్షతన ఐటీ శాఖపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో ఇండస్ట్రియల్ పాలసీతో పాటుగా, ఐటీ పాలసీనీ ప్రకటించేలా సమాయత్తమవ్వాలి. సైబర్ సెక్యూరిటీకి టాప్ ప్రయారిటీ ఇవ్వాలి. ఐటీలో భారీ పెట్టుబడుల ఆకర్షణపైనే దృష్టి పెట్టాలి. చౌకగా సంస్థలను ఏర్పాటు చేయడంలో ఏపీ అత్యంత అనుకూలం. ఐటీకి గమ్యస్థానంగా నిలిచే అన్ని వనరులు గల రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఐటీ పాలసీపై తుది కసరత్తు పూర్తిచేయడంలో వేగం పెంచాలి. పరిపాలన విభాగం కిందకి ఈ -ప్రగతి, రియల్ టైమ్ గవర్నెన్స్, తద్వారా వేగంగా మరిన్ని సేవలందించే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. నైపుణ్యంలో భాగంగా హై-ఎండ్ స్కిల్ యూనివర్శిటీ, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ (ఐఐడీటీ), ఐటీ ప్రమోషన్స్ పరిధిలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ఏజెన్సీ (ఏపీఈఐటీఏ), ఆంధ్రప్రదేశ్ ఇన్నొవేషన్ సొసైటీ (ఏపీఐఎస్) అన్ని రంగాల ఉద్యోగావకాశాలకు సంబంధించిన డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌పై చర్చించారు.

**ఉపాధి వివరాలకు ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫామ్**

విద్య, అర్హతలు, అవకాశాలను బట్టి నేరుగా ఉపాధి వివరాలు తెలుసుకునే విధంగా ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రొక్యూర్‌మెంట్, ఇన్‌ఫ్రా & కమ్యునికేషన్స్ కింద ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సెర్వీసెస్ (ఏపీటీఎస్) 'మీ-సేవ' టెక్నికల్‌గా గ్రామసచివాలయాల (పంచాయతీరాజ్ శాఖ) పరిధిలోకి తరువాయి 2లో..

## ఏపీలో కరోనా విలయ తాండవం

### ఒక్కరోజులో 8,147 కేసులు నమోదు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి విలయ తాండవం చేస్తోంది. రోజు రోజుకూ కేసులు సంఖ్య భారీగా పెరిగిపోతోంది. ఇవాళ రికార్డు స్థాయిలో 8,147 మందికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. రాష్ట్రంలో ఒక్కరోజులో ఇంత మొత్తంలో కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు కరోనా సోకిన వారి సంఖ్య 80,858కి చేరింది.తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా 1029 కేసులు నమోదయ్యాయి.కరోనా కారణంగా ఈ ఒక్కరోజే 49 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇప్పటి వరకు ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 933కి చేరింది. తూర్పుగోదావరి జిల్లాలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. కృష్ణా జిల్లాలో 9, కర్నూలులో 8, శ్రీకాకుళంలో 7, పశ్చిమగోదావరిలో 5, గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో 3, చిత్తూరు, ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బులిటెన్ తరువాయి 2లో..

## ఇంద్రకీలాద్రిపై శ్రావణమాసం సందడి

### అమ్మవారికి ప్రత్యేక పూజలు

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం సందడి నెలకొంది. శ్రావణ మాసం తొలి శుక్రవారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి శుక్రవారం పెద్దసంఖ్యలో అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం మొదటి వారం నుండే వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించుకొని అమ్మవారి దర్శనానికి భక్తులు వస్తున్నారు. దుర్గమ్మని దర్శించుకోవడం ఆనందంగా ఉందని భక్తులు పేర్కొన్నారు. కరోనా నేపథ్యంలో ఇంద్రకీలాదిపై ఆంక్షలు కొనసాగుతున్నాయి.

శ్రావణ శోభకు కరోనా దెబ్బ..

శ్రావణ మాసాన్ని ఎంతో పవిత్రమైన తరువాయి 2లో..




## అక్రమాలకు పాల్పడితే

# లైసెన్సు రద్దు



గుంటూరు : కరోనా నిబంధనలు పాటించడంలో చాలామంది నిర్లక్ష్యం వహిస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి మేకతోటి సుచిరిత అన్నారు. కరోనా నియంత్రణపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆమె ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. జిల్లా వ్యాప్తంగా కరోనా కేసులు రోజురోజుకి అధికమవుతున్నాయని నిర్లక్ష్యం వహించడం వల్ల కేసుల తరువాయి 2లో..

## ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు

### డీజీపీ గౌతమ్ సవాంగ్

తూర్పుగోదావరి: రాజమండ్రిలో దళిత యువకుడు వరప్రసాద్ శిరోముండనం ఘటన దర్యాప్తులో వేగం పెంచాలని జిల్లా ఎస్పీని ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడుతూ కేసులో ప్రమేయం ఉన్న ప్రతిఒక్కరిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరానికి పాల్పడినవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, తప్పుడు సమాచారాన్ని చేర వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ నెల 18 రాత్రి మునికూడలి గ్రామం వద్ద ఇసుక లారీ.. బైక్‌ను ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న వ్యక్తికి కాలు విరిగింది. దీంతో కొంతమంది ఎస్సీ యువకులు లారీని అడ్డుకుని వాగ్వివాదానికి దిగడంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. అదే సమయంలో కారులో అటుగా వచ్చిన మునికూడలి పంచాయతీ మాజీ సర్పంచ్ భర్త కవల కృష్ణమూర్తి 'ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.. లారీని వదిలేయండి' అని



చెప్పడంతో ఆ యువకులు ఆయనతో కూడా గొడవకు దిగి కారు అద్దాలను పగులగొట్టారు. అడ్డుకోబోయిన అడప పుష్కరం అనే అతడిని కొట్టారు. దీంతో గొడవ పడిన ఐదుగురు యువకులపై అడప పుష్కరం సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు సోమవారం ఇన్‌చార్జ్ ఎస్సై ఫిరోజ్ షా నిందితుల్లో ఒకరైన ఇండుగుమిల్లి ప్రసాద్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి తరువాయి 2లో..

# పీపుల్ పవర్ ఆధ్వర్యంలో కధా టీ అందజేత



భీమునిపట్నం : లైట్ హౌస్ దగ్గర శుక్రవారం పీపుల్ పవర్ ఆధ్వర్యంలో వ్యాధినిరోధక శక్తి పెంపొందించుకోవడం లో భాగంగా భారతదేశ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కధా టీ నీ గురించి ప్రజల్లో అవగాహన మరియు తయారు చేసుకునే విధానం వివరించడం జరిగింది.

దీనికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది దీని ద్వారా ప్రజల్లో వ్యాధినిరోధక శక్తి పెంపొందించుకుని కుటుంబాలతో ప్రస్తుత కాలంలో విజృంభిస్తున్న కోవిడ్ 19 భారీన పడకుండా సోషల్ డిస్టెన్స్ పాటిస్తూ, మాస్కులు ధరిస్తూ, శానిటైజర్ వాడుతూ, వ్యాధి నిరోధక శక్తి కూడా చాలా ముఖ్యమని తెలియజేస్తూ యొక్క కధా టీ నీ అందరికీ ఉచితంగా ఇవ్వడం జరిగింది.

# సర్వజన ఆసుపత్రి సందర్శించిన జిల్లా కలెక్టర్



శ్రీకాకుళం : ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి లో కోవిడ్ విభాగాన్ని జిల్లా కలెక్టర్ జె నివాస్ శుక్రవారం పరిశీలించారు. ఆసుపత్రిలో కంట్రోల్ రూమ్ ను సందర్శించారు. కంట్రోల్ రూమ్ నుండి కోవిడ్ వ్యాధిగ్రస్తులకు వైద్య చికిత్స అందుతున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. కంట్రోల్ రూమ్ తో ప్రతి అంశాన్ని అనుసంధానం చేయాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం వైద్యులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. సర్వజన ఆసుపత్రి లో రెండు బ్లాకులు కరోనా వ్యాధిగ్రస్తులకు కేటాయించడం జరిగిందని అన్నారు. ప్రతి బెడ్ కు ఆక్సిజన్ సరఫరా జరగాలని ఆయన పేర్కొన్నారు. ఆక్సిజన్ కొరత సమస్య లేకుండా ముందస్తు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. కోవిడ్ పేషెంట్లు పాటించాల్సిన నియమ నిబంధనలను స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమయానుసారం అందించాల్సిన మందులు, పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. కరోనాపై భయం తొలగించాలని, ధైర్యంగా ఉండాలని సూచించాలని తద్వారా త్వరగా కోలుకొని బయటకు రాగలరని స్పష్టం చేశారు. అందరూ వైద్యులు సమన్వయంతో పనిచేయాలని, ఎటువంటి అజాగ్రత్త ఉండకూడదని ఆదేశించారు. అన్ని మందులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

**లక్షణాలు కనిపించగానే పరీక్షలకు :**

లక్షణాలు కనిపించగానే పరీక్షలకు రావాలని కలెక్టర్ నివాస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లక్షణాలు వచ్చినప్పటికీ ఇంట్లోనే ఉండటం తద్వారా సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. ఈ పరిస్థితి లో మార్పు రావాలని చెప్పారు. వివక్ష చూపిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వివక్ష చూపిస్తారని ముందుకు రాకుండా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, సర్వజన ఆసుపత్రి ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ. కృష్ణవేణి, నోడల్ అధికారి డాక్టర్ ప్రభాకర్ రావు, వైద్యులు ఆర్.అరవింద్, సనపల నరసింహ మూర్తి, ధనుంజయ , ఏపీ ఎమ్ ఐ డి సి డిఈ ప్రసాద్, జె ఇ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు .

# ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఉండాలి



విజయవాడ : ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల వేతనాలు ఉండాలి అని వై.ఎస్.ఆర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పే కమిటీ కమిషనర్ అశుతోష్ మిశ్రా కు విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణా శాఖ, ప్రధాన కార్యాలయం లో ఉద్యోగుల వేతనాల కు సంబంధించి పే కమిటీ తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశనికి వై.ఎస్. ఆర్.ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.దేవ రాజులు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వి.జయరావు, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు జాన్ పాల్, జి.వి.రావు తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ ని 01-01-2020 న వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా రవాణా శాఖగా ఏర్పాటు చేసి ప్రభుత్వం లో విలీనం చేశారు. అందుకు ప్రభుత్వనికి ఆర్టీసీ కార్మికులు ఋణపడి ఉంటారని చెప్పారు. ఆర్టీసీ లో 25 శాతం తాత్కాలిక ఫిట్మెంట్ చేసారని, ప్రస్తుతం మాస్టర్ స్కేల్ అమలు చేసి 63 శాతం ఫీట్మెంట్ చేయాలని కోరారు. 30 శాతం, 25 శాతం, 20 శాతం ఇంటి అద్దె క్రింద ఇవ్వాలని కోరుతున్నారు. ఎల్.టి.సి వద్దని ఇస్తున్న పాస్ తో పాటు స్పౌస్ కు ప్రత్యేకంగా పాస్ ఇవ్వాలని కోరారు. స్టాగేషన్ ఇంక్రిమెంట్లు 6, 12, 18, 24, 30 ఉండాలని, వార్షిక ఇంక్రిమెంట్లు 3 శాతం పెరగాలని, ఒకే కేటగిరీలో బేసిక్ సీలింగ్ ఉన్నప్పటికీ స్టాగ్నషన్ ఇంక్రిమెంట్లు అమలు చేయాలి, ఇటీవల రద్దు చేసిన ఎస్.ఆర్.బి.ఎస్., ఎస్.బి.టి లతో పాటు సి.సి.ఎస్ తదితర సంక్షేమ పథకాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో మాదిరిగా సీలింగ్ లేకుండా గ్రాట్యుటి ఇచ్చి మెడికల్, హెల్త్ కార్డు ఇవ్వాలని కోరారు. ఓల్డ్ పెన్షన్ విదానం అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగుల తో సమానంగా అన్ని కేటగిరీలు వుండే విదంగా ఉండాలి అని తెలిపారు.

# కోవిడ్ ఆసుపత్రిలో డ్యూటీ వైద్యుల నియామకం

శ్రీకాకుళం : జిల్లా కోవిడ్ ఆసుపత్రి %--% జెమ్స్ లో డ్యూటి వైద్యుల నియామకానికి చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎం.చెంచయ్య శుక్ర వారం తెలిపారు.ఎం.బి.బి.ఎస్, ఆయుష్ వైద్య విద్య అభ్యసించి ఏపి మెడికల్ కౌన్సిల్ లో నమోదైన అభ్యర్ధులు అర్హులని చెప్పారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేడు ఉదయం 10.30 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డి.ఎం. హెచ్.ఓ) కార్యా లయంలో హాజరు కావచ్చని తెలిపారు 104 సేవలలో చేస్తున్న వైద్య అధి కారులు కూడా వాక్ఇన్ ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫి కెట్స్ తో హాజరుకావచ్చని ఆయన పేర్కొన్నారు.

# దళితుల ఆత్మాగౌరవం కాపాడేది కాంగ్రెస్సే

**వజ్జిపర్తి శ్రీనివాస్**



విశాఖపట్నం : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి వజ్జిపర్తి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో అధికారపార్టీ నాయకులు, పోలీసులు దళితుల మీద కక్షకట్టినట్లు దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు, చీరాల, సీతానగరం,రాజమండ్రి ఇలా రాష్ట్రంలో అనేకచోట్ల వరుస దాడులు చేస్తున్నారని దుయ్యబట్టారు.పోలీసులు గూండాల్లా వ్యవహరించారన్నారని విమర్శించారు.సోషల్ మీడియాలో పోస్ట్ నెపంతో మహేష్ మీద కేసులు పెట్టి అరెస్ట్ చేసారని,మాస్కు లేదనే నెపంతో కిరణ్ కుమార్ ను గొడ్డును బాదినట్లు బాది చంపేసారని ఆరోపించారు.ఇసుక అక్రమ రవాణా పై ప్రశ్నించిన వరప్రసాద్ ను పోలీస్ స్టేషన్లో శిరోముండనం చేసి అవమానించారని, ఇన్ని దారుణాలు జరుగుతున్నాయి ఎస్సీ ఎస్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం దారుణం అన్నారు. దళితుల ఆత్మాగౌరవం కాపాడేది కాంగ్రెస్సే అన్నారు. బాధితులకు తమ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందన్నారు.

# కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాస పూజలు



విశాఖపట్నం : పాతనగరం కురుపాం మార్కెట్ ప్రాంతంలో వున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం లో శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహిం చినట్లు ఆలయ ప్రధానార్చకులు ఆర్. బి. బి. కుమార్ శర్మ తెలిపారు. ఆలయం గర్భగుడిలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్ కు తెల్లవారుజామున క్షీరాభీషేకం, అన్నిరకాల పండ్లరసములతో మరియు 108 రకాల ద్రవ్యములతో ప్రత్యేక అభిషేకం గావించి పిదప వివిధరకాల పుష్పముల తో మరియు 108 బంగారు పుష్పముల తో అలంకరణ గావించి భక్తులకు దర్శనం కల్పించినట్లు తెలిపారు. కోవిడ్ ఆంక్షలు అమలవుతున్న ప్రస్తుత తరుణంలో భక్తుల భద్రత దృష్ట్యా ఈ సంవత్సరం మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించలేదని తెలిపారు. భక్తులందరూ తమ తమ ఇళ్ళలోనే అమ్మవారి పూజానంతరం ఆలయంలో అమ్మవారి దర్శనానికి రావాలని సూచించిన విధంగా మాస్క్ లు ధరించి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సామాజిక దూరం పాట్ంచే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

# 50 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు



దేవరాపల్లి : పెదగంగవరం గ్రామంలో నాలుగో విడత ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించినట్లు సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక మండల అధ్యక్షుడు కె.వి. రమణ తెలిపారు. పెదగంగవరంలో విశాఖపట్నానికి చెందిన రాఘవేంద్ర కంటి ఆసుపత్రి వారు శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.

డాక్టర్ మురళీ ఈ కార్యక్రమంలో యాభై మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆపరేషన్ నిమిత్తం విశాఖపట్నం తరలించారు .వీరికి వైఎస్ఆర్ కంటి వెలుగు ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని రమణ తెలిపారు.అలాగే శనివారం చినగంగవరం గ్రామంలో సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక ద్వారా ఇదే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. చినగంగవరం తదితర ప్రాంతాల ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# పేరయ్య సేవలు చిరస్మరణీయం




దేవరాపల్లి : సిపిఎం పార్టీ సీనియర్ నేత బల్జి పేరయ్య సేవలు చిరస్మరణీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు, డి వెంకన్న అన్నారు. శుక్రవారం పేరయ్య స్వగ్రామం ఇప్పగరువులో సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సీహెచ్ రాజు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు. వాలాబు పంచాయతీ ఇప్పగరువు మారుమూల గ్రామానికి చేందిన పేరయ్య పదహారు సంవత్సరాలు క్రితం సిపిఎం పార్టీ కి పరిచయం అయ్యి నిస్వార్థ పరునిగా నిజాయితీగా గిరిజన ఉద్యమంలో పని చేశారన్నారు. అయిన లేని లోటు పార్టీ కి ప్రజలకు తీరని లోటని అన్నారు. పేరయ్య ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో కె. అప్పారావు, కె. సన్యాసి, డి. శంకరావు, జె. ఈశ్వరావు, వి. దోంగబాబు, సిహెచ్. చినదేముడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**మొదటి పేజీ తరువాయి**

# కోవిడ్ మరణాలు తగ్గిచండంపై దృష్టిపెట్టాలి

కేసులు సంఖ్య పెరిగిందని వివరించారు. దాదాపు 90 శాతం పరీక్షలు వీరికే చేస్తున్నామన్నారు. రానున్న కొన్నిరోజులు కేసుల తీవ్రత ఇలాగే కొనసాగి, తర్వాత తగ్గుముఖం పడుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు తెలిపారు. ఈ అంకెలను చూసి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు.

**నిమ్మ ధరలపై కీలక ఆదేశం**

రాష్ట్రంలో నిమ్మ ధరలు పడిపోవడంపై సీఎం వైఎస్ జగన్ శుక్రవారం సమీక్షించారు. రైతులకు మేలు చేసేలా కీలక ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ప్రభుత్వమే నిమ్మ కొనుగోలు చేసి మద్దతు ధర వచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశాలిచ్చారు. రేపటి నుంచి నిమ్మ కొనుగోలు చేపడతామని ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి కన్నబాబు మీడియాకు తెలిపారు. ఏలూరు, గుడివాడతో పాటు నిమ్మ మార్కెట్లలన్నింటిలో కొనుగోలు చేపడుతామని చెప్పారు. రైతుకు మద్దతు ధర వచేలా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.

# ఇకపై ఉద్యోగ వివరాలకు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్..

తీసుకువెళ్లడంపైనా చర్చించారు. దీనిపై జీవో ఇచ్చినా ఇంకా సాంకేతిక కారణాల దృష్ట్యా ఐటీ పరిధిలోనే ఉందని స్పెషల్ చీఫ్ సెక్రటరీ సుందర్ మంత్రికి వివరించారు. జీఏడీ దృష్టికి తీసుకువెళ్లి ఆ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని మంత్రి మేకపాటి అధికారులకు సూచించారు. పరిపాలన సౌలభ్యం కోసం ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ(ఏపీఐటీఏ), ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఏపీఎస్ఏసీ), సొసైటీ ఫర్ ఆంధ్రప్రదేశ్ నెట్ వర్క్స్ (ఎస్ఏపీనెట్)లను ఒక తాటిపైకి తీసుకురావడంపైనా కార్యదర్శి భాను ప్రకాశ్, సలహాదారులతో మంత్రి చర్చించారు.

**వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ఎటువంటి సమస్యలు ఉండకూడదు**

కరోనా ఉధృతి నేపథ్యంలో ఐటీ ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్'కు అనుగుణంగా అన్ని విధాల సన్నద్ధానికి మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ఐటీ ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్'లో ఎటువంటి సమస్య రాకుండా చూడాలి. ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి గౌతమ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐటీ బడ్జెట్, వినియోగంపై తదితర శాఖాపరమైన ఆర్థిక అంశాలపై మంత్రి ఆరా తీశారు. కోవిడ్-19 నేపథ్యంలో ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు, టెక్నాలజీ వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు.

ఐటీ శాఖలో ఐఎస్‌బీ భాగస్వామ్యంపై శిక్షణ, సంస్థాగత నిర్మాణాలపై అధ్యయనం, ఆర్థిక సర్దుబాటు, పెట్టుబడుల ఆకర్షణ అంశాలలో ఐఎస్‌బీ సౌజన్యం, వినియోగించుకునే పద్ధతిపైనా చర్చించారు. ఐటీ శాఖపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షకు హాజరైన వారిలో ఐటీ శాఖ కార్యదర్శి యేటూరు భాను ప్రకాశ్, ప్రత్యేక కార్యదర్శి బి సుందర్, ఐటీ సలహాదారులు లోకేశ్వర్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి (టెక్నికల్), దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి (టెక్నికల్), ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీ నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో కరోనా విలయ తాండవం

విడుదల చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 15,41,993 నమూనాలను పరీక్షించినట్లు బులిటెన్‌లో పేర్కొంది. ఇప్పటి వరకు 39,935 మంది మహమ్మారి నుంచి కోలుకొని డిశ్చార్జికాగా.. మరో 39990 మంది వివిధ కొవిడ్ ఆస్పత్రులు, క్వారంటైన్ కేంద్రాల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపింది.

# ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు

తీవ్రంగా కొట్టారు. అంతటితో ఆగకుండా ట్రిమ్మర్ తెప్పించి అతడి గడ్డం, మీసాలు, తల వెంట్రుకలను తొలగించి విడిచిపెట్టారు. ఈ కేసులో ఇన్‌చార్జ్ ఎస్సైతోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది.

# అక్రమాలకు పాల్పడితే లైసెన్సు రద్దు

తీవ్రత పెరుగుందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా లక్షా యాభైవేల మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా పదివేలకు పైగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని సుచరిత పేర్కొన్నారు.

మూడు వేల బెడ్స్‌తో మరో పన్నెండు ప్రైవేటు ఆసుపత్రులను సిద్ధం చేశామని, హాస్పిటల్స్‌లో సిబ్బంది భయపడకుండా సేవలందించాలిని ఆ సందర్భంగా కోరారు. వైద్యం విషయంలో అక్రమాలకు పాల్పడితే ప్రైవేటు ఆసుపత్రుల లైసెన్సు రద్దు చేస్తామని సుచరిత హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో 48,114 కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయగా 8,147 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 80,858 కు చేరింది. వీటిలో ఒక్క గుంటూరు జిల్లాలోనే 703 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి.

# ఇంద్రకీలాద్రిపై శ్రావణ మాసం సందడి

మాసంగా భావిస్తారు. మహిళలు ఈ మాసం అత్యంత శుభ ప్రదమైనదిగా భావించి నోములు, వ్రతాలు నోచుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఇక పెళ్లిళ్లు తది తర శుభకార్యాలకు ఇది దివ్యమైన మాసం. ఈ నెల రోజులు నగరంలో పండుగ వాతావరణం సంతరించుకుంటుంది. ప్రతి ఏడాది అన్ని రకాల వ్యాపారాలు జోరుగా సాగుతాయి. అయితే కరోనా ఎఫెక్ట్‌తో శ్రావణం మూగబోయే పరిస్థితి నెలకొంది.

# ఏపీ సర్కార్‌కు సుప్రీంలో మరో ఎదురుదెబ్బ

దిల్లీ: ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. నిమ్మగడ్డ అంశంలో కోర్టు ధిక్కరణ ప్రొసీడింగ్స్ పై స్టే ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. నిమ్మగడ్డ రమేష్ కుమార్ తరపున సీనియర్ న్యాయవాది హరీశ్‌సాల్వే వాదనలు వినిపించారు.

రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టుకు వచ్చినందున స్టే ఇచ్చేందుకు వీలు లేదని, కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయటం లేదని హరీశ్ సాల్వే వివరించారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై అధికార పార్టీ నేతలు సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్టు కామెంట్లు కూడా చేశారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తీర్పు ఇచ్చిన న్యాయమూర్తిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని వెల్లడించారు. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఈ కేసుకు సంబంధించి ప్రతి విషయం మాకు తెలుసు. మేం కావాలనే ఈకేసులో స్టే ఇవ్వట్లేదు. గవర్నర్ లేఖ పంపినా రమేష్ కుమార్‌కు పోస్టింగ్ ఇవ్వకపోవడం అత్యంత దారుణం. కోర్టు ఉత్తర్వులే కాకుండా.. గవర్నర్‌తో కూడా చెప్పించుకోవాలా?" అని సీజేఐ వ్యాఖ్యానించారు. గతంలో నిమ్మగడ్డ నియామకానికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు కూడా నిరాకరించామని సీజేఐ గుర్తు చేశారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్టు స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాలు పాటించకపోతే.. అది కోర్టు ధిక్కరణ కిందికే వస్తుందని సీజేఐ తెలిపారు. హైకోర్టు తీర్పు తర్వాత పరిణామాలపై అఫిడవిట్ దాఖలు చేస్తామని హరీశ్ సాల్వే కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ..పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలు చేసేందుకు నిమ్మగడ్డకు వారం రోజుల గడువు ఇచ్చింది.

# ఇకపై ఆన్‌లైన్‌లోనే డ్రైవింగ్ లైసెన్స్

**పువ్వాడ అజయ్**

హైదరాబాద్: ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు తెలంగాణ రవాణాశాఖ మరిన్ని ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫెస్ట్ (ఫ్రెండ్లీ ఎలక్ట్రానిక్ సర్వీస్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టు) పేరిట ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఈ సేవలను ప్రారంభించారు. వీటి ద్వారా 5 రకాల ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రజల సమయం వృథా కాకుండా పారదర్శకత కోసం ఈ విధానాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి స్పష్టం చేశారు. ఇకపై డూప్లికేట్ లెర్నింగ్ లైసెన్స్, బ్యాడ్జీలను అందజేయడం, డూప్లికేట్ లైసెన్స్, హిస్టరీ షీట్, పాతకార్డు స్థానంలో స్మార్ట్ కార్డులను ఇవ్వడం వంటి 5 రకాల సేవలను ఆన్‌లైన్ ద్వారా అందించనున్నారు. మరో ఆరు సేవల్ని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పని చేసే ఈ సేవలను మొబైల్‌లో పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత అనేక సంస్కరణలు వచ్చాయని, మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా దేశంలోనే తొలిసారిగా రవాణాశాఖలో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించడం గర్వంగా ఉందని అజయ్ పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి జగన్ కి పాలాభిషేకం చేసిన మత్స్యకారులు



భీమునిపట్నం: గోస్తనీ సాగర సంగమం వద్ద మత్స్యకార యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి సాంప్రదాయ మత్స్యకారుల తో కలిసి పాలాభిషేకం చేసారు.దశాబ్దాల మత్స్యకార రాజకీయ జీవితాల్లో ఎన్నడు ఊహించని విధంగా మొట్టమొదటిసారి ఉత్తరాంధ్ర సాంప్రదాయ మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన పలాస శాసనసభ్యులు డాక్టర్ ఎస్.అప్పలరాజు ను ముఖ్యమంత్రి తన మంత్రివర్గంలోకి తీసుకొని, రాష్ట్ర మత్స్య శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించడం, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి విధేయుడిగా ఉన్న మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ రావు ని ముఖ్యమంత్రి జగన్ పెద్ద మనసుతో మత్స్యకార సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తూ రాజ్య సభ సభ్యునిగా నియమించడాన్ని పురస్కరించుకొని శుక్రవారం ముఖ్యమంత్రి జగన్ కి వాసుపల్లి జానకిరామ్ పాలాభిషేకం చేసారు.ఈ సందర్భంగా జానకిరామ్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక నూతన పథకాలను ప్రవేశపెడుతూ మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఆయన పాదయాత్ర లో హామీ ఇచ్చిన విధంగా పాకిస్తాన్ నుంచి ఉత్తరాంధ్ర మత్స్యకారులు విడుదల చేయించడం, వారి ఉపాధి కోసం కోటి రూపాయల పరిహారం అందజేయడం, అదేవిధంగా ప్రమాదవశాత్తు బంగ్లాదేశ్ లో చిక్కుకున్న ఉత్తరాంధ్ర మత్స్యకారులను విడుదల చేయించడం, మత్స్యకారుల వలసలు తగ్గించడం కోసం కొత్తగా తొమ్మిది ఫిషింగ్ హార్బర్ లు 4 ఫిష్ లాండింగ్ సెంటర్లో ఏర్పాటు చేయటం, ఎవరైనా మత్స్యకారుడు వేటకి వెళ్లి ప్రమాదవశాత్తు చనిపోతే వారికి పది లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ఇవ్వటం, వంటి వి ఆయన మేనిఫెస్టోలో పెట్టిన పథకాలతో పాటు, మేనిఫెస్టోలో చెప్పని పథకాలను కూడా అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని, భీమిలి ప్రాంత మత్స్యకారుల చిరకాల వాంఛ అయిన ఫిషింగ్ జట్టి (ఫిష్ లాండింగ్ సెంటర్) ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి మత్స్యకారులు వారియొక్క బోట్లను సురక్షితంగా కట్టుకోవటానికి, వేటకు వెళ్లే సంప్రదాయ మత్స్యకారులు ఎటువంటి ప్రమాదాలకు గురి కాకుండా వీలైనంత త్వరగా ఫిషింగ్ జెట్టి ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయటానికి జిల్లా మంత్రి స్థానిక శాసన సభ్యుడు అవంతి శ్రీనివాస్ రావు తో పాటు మత్స్య శాఖ మంత్రి సిదరి అప్పలరాజు సహకారంతో వీలైనంత త్వరగా ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశిస్తున్నామని, అదేవిధంగా ఉత్తరాంధ్ర వెనుక బాటు తనాన్ని గుర్తించి విశాఖ కేంద్రంగా పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయాన్ని ఈ ప్రాంత మత్స్యకారులు అందరూ స్వాగతిస్తున్నారని, ఎన్ని అవాంతరాలు వచ్చినా జగన్మోహన్ రెడ్డి ఒక నిర్ణయం తీసుకుంటే ఖచ్చితంగా అమలు చేస్తారనే నమ్మకం మాకు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంప్రదాయ మత్స్యకారుల తో పాటు పిరుపల్లి ముసలయ్య, వాసుపల్లి మొగ్గన్న, కోడ మూర్తి, వాసుపల్లి సత్యారావు, సురపతి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# వర్సిటీ రెక్టార్‌గా ఆచార్య కె.సమత అభినందించిన వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం రెక్టార్‌గా ఏయూ భౌతిక శాస్త్ర విభాగం ఆచార్యులు కె.సమత నియమితులయ్యారు. శుక్రవారం వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్ ఆచార్య సమతకు ఉత్తర్వులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య ఆర్.శివ ప్రసాద్, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య క్రిష్ణమంజరి పవార్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి మహిళలకు పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో వర్సిటీలో అత్యున్నత పదవుల్లో మహిళలకు సముచిత స్థానం ఇవ్వడం జరిగిందన్నారు. భవిష్యత్తులో సైతం విశ్వవిద్యాలయం పరిపాలనలో మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పాలక మండలి సభ్యుల్లో సైతం అధికశాతం మంది మహిళలకు స్థానం ఇవ్వడం జరిగిందన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం నూతన రెక్టార్‌గా మహిళలకు అవకాశం ఇవ్వడం జరిగింది. ఇప్పటికే వర్సిటీలో పలు పరిపాలనా పదవుల్లో అన్ని సామాజిక వర్గాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోంది. తాజాగా మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ రెక్టార్‌గా ఆచార్య సమత నియామకం జరిగింది.

# పోర్టు కార్మికులకు న్యాయం చేయండి

## 347 బ్యాచ్ క్యాజువల్స్ కు పని వేతన కల్పించండి



విశాఖపట్నం : విశాఖ పోర్టు ట్రస్ట్‌లో గత 12 సంవత్సరాలుగా సేవలందిస్తున్న క్యాజువల్ కార్మి కులను ఆదుకోవాలని సత్వ రమే న్యాయ చేయాలని విశాఖ ఎంపి ఎంవీవీ సత్యనారాయణ కోరారు. ఈ మేరకు శుక్రవారం 347 బ్యాచ్ క్యాజువల్ కార్మి కులుకి సంబంధించిన పలు పెండింగ్ అంశాలను పోర్టు చైర్మన్ కె.రామ్మోహన్‌రావు, డిప్యూటీ చైర్మన్ హరనాథ్‌ల దృష్టికి ఎంపి తీసుకువెళ్లారు. కారుణ్య నియా మకాల కింద 12 ఏళ్ళ క్రితం ఉద్యోగంలో చేరిన 347 క్యాజువల్ కార్మికులకు నేటికి సరైన పనిలేకుండా నానా అవ స్థలు పడుతున్నారని ఎంపి తెలిపారు. కేంద్రమంత్రి మాండవీయతో పలు మార్లు మాట్లాడటం జరిగిందని మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎంపి వారికి తెలిపారు. డిఎల్‌బి నుంచి వీరంతా పోర్టులో విలీనం ఐయ్యారని ఐతే ఏళ్ళు గడుస్తున్నా నేటికి వీరికి సరైన పనిలేకుండా పోవడం వలన కుటుంబాలతో వీరు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నట్టు ఎంపి నివేదించారు. వీరితో పాటు చేరిన 27 మందిని రెగ్యులర్ చేశారని తక్షకణమే పోర్టులో ఖాళీగా వున్న పనులకు వీరిని వినియోగించుకోవాలని చైర్మన్ ను కోరినట్టు ఎంవీవీ చెప్పారు. ఇందుకు పోర్టు చైర్మన్, డిప్యూటీ చైర్మన్ లు కూడా సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వీరి సమస్యకు పరిష్కారం చూపిస్తామని వీరు హామీ ఇచ్చినట్టు ఎంపి ఎంవీవీ తెలిపారు. ఈ సందర్భంగో చైర్మన్ ,డిప్యూటీ చైర్మన్ లను ఎంపి ఎంవీవీ, కార్మికు సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోర్టు ట్రస్ట్ మాజీ సలహాదారు , జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి , వైజాగ్ జర్నలిస్టుల పోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, క్యాజువల్ కార్మికుల సంఘం ప్రతినిధులు శ్రీనివాస్ వర్మ, గోపి, కృష్ణ, ప్రసాద్ తదితర్లు పాల్గోన్నారు.

# అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

## - ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి : గ్రామాల అభివృద్ధికి తోడ్పాటుగా మండల అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండల కేంద్రం దేవరాపల్లిలోని ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం మనం - మన పరిశుభ్రత పై దేవరాపల్లి, కలిగొట్ల గ్రామ సచివాలయం కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు ఆరోగ్యవంతంగా ఉన్నపుడే గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. దానికి అనుగుణంగా అధికారులు పని చేయాలన్నారు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతి మండలంలోని రెండు గ్రామాలను ఫైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేశారన్నారు. అందులో భాగంగా దేవరాపల్లి, కలిగొట్ల గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. రెండు గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాలలో వ్యక్తిగత పరిశుభ్యం పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 24 నుంచి ఆగస్టు 15 వరకు చేపట్టాలని సూచించారు. గ్రామాలలో తడి పొడి చెత్త సేకరించి, పారిశుధ్య మెరుగుపర్చాలన్నారు. ప్రస్తుతం కరోనా వైరస్ పరిస్థితులు వలన ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులు ఖర్చు చేసి తాగునీటికి, పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సి హెచ్. సుబ్బలక్ష్మి, ఈ ఓ పి ఆర్ డి ఎం. రాధిక, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలు అనుమతిలేకుండా జాతీయ రహదారి భూసేకరణ చేయరాదు?



అరకులోయ : మండలంలోని జాతీయ రహదారి నిర్మాణం కోసం సర్వే నిమిత్తం శుక్రవారం వరకు మండల తాసిల్దార్ శ్యాం బాబు సిబ్బంది సర్వే నిమిత్తం మండలంలోని ఎండపల్లి వలస గ్రామంలోని భూసేకరణ కోసం వచ్చిన రెవెన్యూ అధికారులను గ్రామస్తులు అడ్డుకోవడం జరి గింది. పాత రహదారిలోని నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పాడేరు ఐటీడీఏ పీవో వెంకటేశ్వర కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు 6 గ్రామాల ప్రజలు భూములు పంట పొలాలు నష్టపోతుందని పిఓ దృష్టికి తెస్తామన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో పిజ్జా గ్రామ సభలు అనుమతి లేకుండా భూసేకరణ చేయ రాదని భూములు నష్టపోతున్న రైతులు పాల్గొనడం జరిగింది.

ఈ క్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కిల్లో సురేంద్ర పాల్గొన్నారు.

# యూపీ ఆరోగ్యశాఖ మంత్రికి కరోనా పాజిటివ్

బల్లియా: ఉత్తర్‌ప్రదేశ్‌లో కరోనా విజృంభణ కొనసాగుతోంది. తాజాగా, యూపీ ఆరోగ్యమంత్రి జై ప్రతాప్ సింగ్ కరోనా బారినపడ్డారు. ప్రస్తుతం ఆయన హెూం ఐసోలేషన్‌లో ఉన్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు మంత్రిని కలిసిన వారెవరనే అంశంపై దృష్టిపెట్టారు. మరోవైపు, ఆయన కుటుంబ సభ్యుల నుంచి శాంపిల్స్ సేకరించారు. వారందరి నివేదికలు శనివారం వచ్చే అవకాశం ఉంది. కొద్దిపాటి జ్వరం రావడంతో ఆయన పరీక్షలు చేయించుకోవడంతో పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

బల్లియా జైలులో 160మంది ఖైదీలకు కరోనా

తాజాగా బల్లియా జిల్లా కారాగారంలో 160 మంది ఖైదీలకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు జైలు సూపరింటెండెంట్ ప్రశాంత్ కుమార్ మౌర్య వెల్లడించారు. వైద్యశాఖ అధికారులు 594 మంది ఖైదీలకు పరీక్షలు నిర్వహించగా వారిలో 160మందికి కరోనా సోకినట్టు నిర్ధారించారని తెలిపారు. కరోనా బారిన పడిన అందరికీ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఔషధాలు, ఇతర వసతులు సమకూర్చామన్నారు.

# రోటరీ క్లబ్ విశాఖ సెంటినియల్ సుమారు 2 లక్షల విలువైన పరికరాలను ఎబిలిటీ రిహాబిలిటేషన్ సెంటర్ కు విరాళం



విశాఖపట్నం : రోటరీ క్లబ్ విశాఖ సెంటినియల్ వారు ఈ రోజు నలుగురు లబ్ధిదారులకు బేబీ సాబా, మాస్టర్ రిక్షిత్ మరియు ఇతరులకు వీల్ చైర్లు , సహాయక పరికరాలు జగదాంబ సెంటర్ వద్ద గల ది ఎబిలిటీ పీపుల్ సంస్థ వారికి అందజేశారు. ముఖ్య అతిథి శ్రీ పివిఎన్ మాధవ్, శాసన మండలి సభ్యులు చేతుల మీదుగా లబ్ది దారులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ రోటరీ క్లబ్లు లు విశాఖ లో ఎప్పటికప్పుడు అవసరమైన మరియు అణగారిన ప్రజలకు చేస్తున్న గొప్ప కృషిని ప్రశంసించారు. విశాఖపట్నం రోటరీ క్లబ్ సెంటెనియల్ ప్రెసిడెంట్ రోటేరియన్ ఎం. దొర బాబు. రూ. 20,000/-, రోటేరియన్ కె వి ఎస్ ఎన్ మూర్తి తన వ్యక్తిగత నిధుల తో హిప్ డిసార్టిక్యులేషన్ ప్రొస్తెటిక్ పరికరం కోసం బేబీ సాబాకు 40,000/- రూపాయలు విరాళం అందించారు. సాబా ఈ కానుక అందు కున్న అనంతరం ఉత్సాహపూరితమైన చిరునవ్వు తో ఉంది. రెండు కాళ్ళపై మొదటిసారి స్వతంత్రంగా నిలబడటం ఒక అద్భుతమైన అనుభూతి ఆమె మెరిసే కళ్ళ నుండి స్పష్టమైంది. బేబి సాబా అనే 5 సంవత్సరాల అమ్మాయి అధిక ఆకాంక్షలతో విశాఖపట్నంలో నివసిస్తుంది. కుడి కాలు లేకుండా జన్మించిన ఆమె తల్లిదండ్రులు నిస్సహాయంగా ఉన్నారు. ఆమె తండ్రి చిన్నటైలరింగ్ పని చేస్తూ కాలం గడుపుతూ ఆ టైలరింగ్ పైనే ఆధారపడి వున్నారు . ఈ ఒక్క కృత్రిమ అవయవం (ప్రొస్థెసెస్) తమ బిడ్డకు చైతన్యాన్ని ఇస్తుందని వారికి ఎప్పుడూ ఊహించలేదని అన్నారు. సాబా పాఠశాలకు వెళ్లి కష్టపడి చదువుకోవాలని యోచిస్తోంది మరియు తన తండ్రికి మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. సాబాకు కావలసిన సహకారం చేస్తానని రోటేరియన్ మూర్తి వాగ్దానం చేసారు. ఆమె పాఠశాలకు వెళ్లడం, విద్యనభ్యసించడం, సురక్షితమైన భవిష్యత్తును పొందగలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు.

ఈ కార్యక్రమంలో రోటరీ కమ్యూనిటీ సభ్యులు భోగావెల్లి జగదీశ్, ముప్పనేని నరేన్ , పోతుల కేశవ్, మదన్ తేజ్, రాజమాత విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్‌మోహన్ రెడ్డికి జనం జేజేలు

## వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ నర్మాల కుమార్



అచ్యుతాపురం : అర్హులైన వారందరికి ఇచ్చిన మాట ప్రకారం కాకుండ అదనంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి జనం జేజేలు పలుకుతున్నారన్నారు. శుక్ర వారం మండలంలో దోసూరు సచివాలయంలో 37 మందికి కొత్తగా మంజూరైన పింఛన్ కార్డులను ఆయన చేతులు మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ అర్హులైన వారికి పింఛన్ లు మంజూరు అయ్యేటట్లు చేసిన ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో వైసిపి నాయకులు ప్రసన్న కుమార్, గండి రాజు, అబద్ధం, అప్పలరాజు, వెంకటరావు, కార్యదర్శి చంద్రకళ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


# ప్రకటన

1. శ్రీ ఎం.ముచిరామ్, ఎంప్లాయ్‌నెం.20281, సి.నెం.204, ఎన్ఆర్‌డబ్ల్యు, నేవల్ డాక్‌యార్డు, విశాఖపట్నం మీద 28 ఆగస్టు 17 నుంచి చార్జి మెమోరాండం జారీ చేసిన తేది వరకు అనగా 13 జూలై 18 వరకు అనధికారికంగా విధులకు హాజరు కానందుకు చార్జి మెమో పిఇఎస్/8401/20281 తేది 13 జూలై 18కు ఎఎస్‌డి(వి) శాఖ సిసిఎస్(సిసి&ఎ) నియమముల యొక్క నియమం 14 ప్రకారం ప్రధాన క్రమశిక్షణా చర్యలు తీసుకోబడినాయి. శ్రీ ఎమ్ ముచిరామ్, స్కిల్డ్, ఎంప్లాయ్ నెం. 20281 ఛార్జి మెమోకు స్పందించుటలో విఫలమైనందున 21 జూలై 19న 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఆంగ్ల దినపత్రికలో విధులకు హాజరు కావలెనని లేదా తనపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ఉండేందుకు కారణం చూపించమని తెలుపుతూ ప్రకటన ఇవ్వబడింది.

2. సదరు వ్యక్తి నుంచి ఎటువంటి స్పందన లేనందున, సంబంధిత క్రమశిక్షణ అధికార విభాగము సంబంధిత నియమాల ప్రకారం విచారణ సహేతుకంగా ఆచరణ సాధ్యం కాదని భావించారు. తదనుగుణంగా సిసిఎస్(సిసి&ఎ) 1965 యొక్క నియమం 19**(ii)** సహాయముతో మరియు పంపిణీ కొర్కై కారణాలు విచారణతో శాఖ ఎఎస్‌డి(వి) మెమో పిఇఎస్/8401/20281 తేది 29 నవంబరు 19 ద్వారా రికార్డు చేయబడ్డాయి. అలాగే దీనిని ఆ వ్యక్తి చిరునామాకు పంపబడింది. మరియు అది తపాలాశాఖ ద్వారా బట్వాడా చేయబడక వ్యాఖ్యలతో తిరిగి వెనక్కి వచ్చినది.

3. అధికారక క్రమశిక్షణా విభాగము వారు కేసు యొక్క మంచిచెడులు పరిగణనలోకి తీసుకొని శ్రీ ఎమ్ ముచిరామ్ తప్పుడు చర్యలకు పర్యవసానంగా ప్రభుత్వశాఖ ఎఎస్‌డి(వి) పిఇఎస్/8401/20281 తేది 08 జనవరి 2020 నియమం ప్రకారం **భవిష్యత్తులో ఉద్యోగ అనర్హతకు వర్తించని విధంగా, సర్వీసు నుంచి తొలగించి శిక్ష విధింపబడింది.** ఈ సమాచారాన్ని తన నివాస చిరునామాకు పంపితే మరల అది తనకు బట్వాడా చేయబడక కొన్ని వ్యాఖ్యలతో తపాలాశాఖ ద్వారా తిరిగి వెనక్కి తిరిగిరాబడింది.

4. ఇందుమూలంగా సంబంధిత అధికారులందరికీ తెలుపునది ఏమనగా శ్రీ ఎమ్ ముచిరామ్ ప్రభుత్వశాఖ ఎఎస్‌డి (వి) పిఇఎస్/8401/20281 తేది 08 జనవరి 2020 ప్రకారం భవిష్యత్తు ఉద్యోగ అనర్హత నుంచి మినహాయింపుతో సర్వీసు నుంచి తొలగించి శిక్ష వేయబడింది.

**అడ్మిరల్ సూపరింటెండెంట్**
**నేవల్ డాక్‌యార్డు (వి)**
**విశాఖపట్నం.**

**davp 10702/11/0024/2021**

# విజయభాను సంపాదకీయం

## సాహిత్యంలో అంతర్భాగాలైన....

ఆయా కాలాల ప్రజల అనుభవాల, భావాల, అభి రుచుల, ఇష్టానిష్టాల, సుఖదుఃఖాల, భౌతిక ఆధ్యాత్మిక విషయాల సంపుటీకర ణమే సాహిత్యం. సాహిత్యంలో అంతర్భాగాలైన పదజాలం, సామెతలు, కవిత్వం ప్రతిదానిలోను ఏదో కొంత సాంస్కృతిక విశేషం లభించవచ్చు. కాలపరిణామంలో, ఆచార సంప్రదాయాల్లో, జీవన సరళిలో ఎన్నోరకాల మార్పు లు చోటుచేసుకోవచ్చు. కొన్ని పూర్తిగా పోవచ్చు. పాక్షికంగా మారవచ్చు. కొత్తవి ప్రారంభం కావచ్చు. వీటికి పరిసర ప్రాంతీయ భాషా సాహిత్య మత వ్యాపార సంబంధాల హేతువు కావచ్చు. దాడులు కావచ్చు. పాలకసంస్కృతి ఆచారాల అనుకరణలు కావచ్చు. సాహిత్యం సంస్కృతీపరిణామాల అవగాహనకు ఆధారభూతంగా ఎలా నిలుస్తుందో వైవిధ్యభరితమైన అంశాలు మచ్చుకు కొన్ని.. ఈ పిల్ల పదహారణాల తెలుగు అమ్మాయి. పిల్ల పదం ఏనాటిది? శాతవాహన కాలంనాటి గాథాసప్తశతిలో తొలిసారి కనిపిస్తుంది. అంతకుముందే జన వ్యవహారంలో నిత్యం వాడుకలో ఉన్న పదం. అంటే ఒక పదం వెనుక వేల ఏళ్ళ చరిత్ర ఉన్నట్లే కదా. మరి పదహారణాల తెలుగు అమ్మాయి అని ఎందుకనాలి? పదిహేడు అనవచ్చు. పద్నాలుగు అనవచ్చు, 20 అణాలు అనవచ్చు కదా! నిజాం కాలంలో ఉన్న ద్రవ్య మారకం ఇది. అణా అంటే ఆరు పైసలు. 16 అణాలు అంటే 96 పైసలు. నిజాంకాలంలో 96 పైసలే రూపా యి కింద లెక్క. బ్రిటిషాంధ్రలో నూరుపైసలకు రూపాయి. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ ముఖ్యమంత్రి అయినప్పుడు నిజాం రుపీ ని బ్రిటిష్ రూపాయిని సమానం చేశారు. అయితే జనంలో సెంట్ పర్సెంట్ (నూటికి నూరుశాతం) అనే దగ్గర పదహారణాలు అనే జాతీయమే వాడుకలో ఉంది. మనం 25 పైసలకు చారాణా (24 పైసలు) అనీ, 50 పైసలకు (48) ఆఠాణా, 75 పైసలకు (72) బారాణా అనీ వ్యవహారానికి వాడుతూ సర్దుకున్నాం. ఇది చరిత్రలోని ఒక పరిణామానికి సాక్ష్యం. ఈ రోజు పెళ్ళిలో మాంగల్యధారణ అన్నది ప్రధానాంశం. నిజానికి ముహూర్తం అంటే నిర్దేశిత సమయమేం కాదు. దాదాపు 40 నిమిషాలు ఉంటుంది. పురోహితులు సరిగ్గా మధ్యలో ముహూర్తం పెడతారు. మన సౌకర్యం కోసం కాస్త అటూ ఇటూ అయినా పరవాలేదు. ఆ మూహుర్తంలో కూడా జిలకర బెల్లం పెట్టడమే ముఖ్యం తప్ప మాంగల్యధారణ కాదు. జిలకరబెల్లం, సప్తపది, హోమం ఇవే పెళ్ళికి మూలం. మాంగల్యధారణ తర్వాత కాలంలో వచ్చిన దాక్షిణాత్య ఆచారం. దీని కాలం ఎప్పటిది అని తెలుసుకోవాలంటే సాహిత్యాధారం తోడ్పడుతుంది. తిక్కన.. ఉత్తరాభిమన్యుల వివాహంలో తలంబ్రాలు పోసుకోవడాన్ని వర్ణించాడే తప్ప మాంగల్యధారణ వర్ణించలేదు. పోతన భాగవతంలో..

మ్రింగెడువాడు విభుండని
మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగుమనె సర్వమంగళ
మంగళ సూత్రంబు నెంతమది నమ్మినదో (భాగవతం.8-241)

అని స్పష్టంగా మాంగల్యధారణను చెప్పాడు. అంటే తిక్కన నాటికి లేకుండా పోతనకాలం నాటికి మధ్యలో ఈ ఆచారం వచ్చి స్థిరపడిందని ఊహించాలి. లలితా సహస్రనామం అందరూ పారాయణం చేస్తుంటారు. బ్రహ్మాండ పురాణం ఉత్తరభాగంలో లలితాసహస్రనామం ఉంది. అందులో కామేశబద్ధమాంగల్య సూత్రశోభిత కంధరా అని వస్తుంది. శివుడు పార్వతిమెడలో మంగళసూత్రం కట్టాడని భావం. బ్రహ్మాండ పురాణం గుప్తుల కాలంలో రాయబడిందంటారు. మరి అప్పుడు ఈ ఆచారం ఉందా? ఉన్నట్లు ఆధారాలు లేవు. ఎవరో భక్తాగ్రగణ్యుడు లలితాసహస్ర నామాన్ని బ్రహ్మాండపురాణంలో దూర్చడంలో విజయం సాధించాడు. ఇలా మధ్యలో చేర్చిన వాటిని ప్రక్షిప్తాలని పిలుస్తాం.

చేతులారంగ శివుని పూజింపడేని -
నోరునొవ్వంగ హరికీర్తి నుడవడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
కలుగ నేటికి తల్లుల కడుపు చేటు..

అందరికీ తెలిసిన పోతన పద్యం ఇది. సాధారణంగా అర్థం చెప్పేస్తారు. కాని ఇందులో ఒక సంస్కృతీ విశేషాన్ని పోతన నిక్షిప్తం చేశాడని గమనిస్తే మరింత ఆనందం కలుగుతుంది. అభిషేకప్రియుడు శివుడు, కనుక శివాలయానికి వెళ్ళి శివుని నెత్తి మీద నీళ్ల పోయాలి. ఎందుకు గరళతాపహరణార్థం. అది చేతులారంగ చేయాల్సిందే. విష్ణువు సంకీర్తన ప్రియుడు. అందుకే విష్ణువుకు సుప్రభాతాలు, సహస్రనామాదులు ఉంటాయి. అవన్నీ నోరు నొవ్వంగ చేయాల్సిందే. చేతులారంగ శివుని పూజింపడేని.. నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని.. అంటే అభిషేకప్రియుడు శివుడు. సంకీర్తన ప్రియుడు విష్ణువు. నమస్కారప్రియుడు సూర్యుడు. స్మరణప్రియుడు దత్తాత్రేయుడు. ఆయాదేవతల అభీష్టాల ప్రకారం పూజిస్తేనే మన అభీష్టాలు నెరవేరుతాయి.

## మహమ్మారిని భారత్ సమర్థంగా ఎదుర్కోగలదు: డబ్ల్యూహెచ్ఓ

### అమెరికా, బ్రెజిల్, భారత్‌లకు కరోనాను ఎదుర్కొనే సామర్థ్యం ఉంది

### ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడి




దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ మహమ్మారి విలయతాండవం చేస్తోంది. ఇప్పటికే కోటిన్నర మందికి సోకిన ఈ వైరస్ 6లక్షల 30వేల మంది ప్రాణాలు తీసుకుంది. ప్రపంచంలోనే అత్యధిక కొవిడ్ కేసులు నమోదతున్న దేశాల్లో అమెరికా, బ్రెజిల్, భారత్ తొలిమూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ దేశాల్లో నిత్యం దాదాపు 50వేల పాజిటివ్ కేసుల చొప్పున బయటపడుతున్నాయి. అయితే, కొవిడ్-19 తీవ్రత ఎక్కువగా ఉన్న ఈ మూడు దేశాలకు వైరస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం ఉందని తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ అభిప్రాయపడింది. శక్తిమంతమైన, సామర్థ్యం కలిగిన, ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా, బ్రెజిల్, భారత్‌లకు ఈ మహమ్మారిని ఎదుర్కొనే అత్యంత అంతర్గత సామర్థ్యాలు ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర విభాగాధిపతి మైక్ రేయాన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ దేశాల్లో వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ వీటిని సమర్థవంతంగా ఎదుర్కొంటాయని అభిప్రాయపడ్డారు.

**అమెరికాలో గంటకు 2600 కేసులు..**

అగ్రరాజ్యం అమెరికాలో కరోనా విజృంభణ కొనసాగుతూనే ఉంది. ప్రతిరోజు రికార్డుస్థాయిలో కేసులు నమోదవుతున్నాయి. ప్రతి గంటకు దాదాపు 2600 పాజిటివ్ కేసులు రికార్డవుతున్నాయి. ఇప్పటికే 40లక్షల పాజిటివ్ కేసులు నమోదుకాగా వీరిలో లక్షా 44వేల మంది ప్రాణాలు కోల్పోయారు. బ్రెజిల్‌లో 22లక్షల పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీరిలో 84వేల మంది మృత్యువాతపడ్డారు. ఇక భారత్‌లో నిన్న ఒక్కరోజే 49,000 పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. మొత్తం కేసుల సంఖ్య 12లక్షల 87వేలకు చేరగా మరణాల సంఖ్య 30వేలు దాటింది

## పట్టపగలే విజయవాడలో భారీ దోపిడీ

విద్యాధరపురం: విజయవాడ పాతబస్తీ కాటూరివారి వీధిలోని నగల దుకాణంలో భారీ దోపిడీ జరిగింది. పట్టపగలే దుండగులు 7 కిలోల బంగారం, 7 కిలోల వెండి, రూ.42లక్షల నగదును దోచుకున్నారని బాధితులు చెబుతున్నారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జ్యువెల్లరీ వ్యాపారి శ్యాంకు పాతబస్తీ శివాలయం వీధిలో నగల దుకాణం, కాటూరువారి వీధిలో వెండి వస్తువులు విక్రయించే దుకాణంలో భాగస్వామ్యం ఉంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఇద్దరు వ్యక్తులు శివాలయం వీధిలోని జ్యువెల్లరీ షాపు వద్దకు నగలు కొనేందుకు వచ్చారు. లాక్‌డౌన్ కావడంతో ఇక్కడ ఉన్న సరకును కాటూరువారి వీధిలోని దుకాణంలో ఉంచామని, కాసేపు వేచి ఉంటే అక్కడి నుంచి తెప్పిస్తామని మరొక వ్యాపార భాగస్వామి మనోహర్‌సింగ్ చెప్పారు. మనోహర్‌సింగ్ సూచనల మేరకు గుమాస్తా నగలు తెచ్చేందుకు కాటూరువారి వీధిలోని దుకాణం వద్దకు రాగా అక్కడ ఉన్న దుకాణం గుమాస్తా విక్రంసింగ్ అపస్మారక స్థితిలో గాయాలతో కనిపించాడు. వెంటనే అతడు ఈ విషయాన్ని యజమాని మనోహర్‌సింగ్‌కు, ఆయన తన వ్యాపార భాగస్వామికి శ్యాంకు తెలియజేశారు. శ్యాం తోటి వ్యాపారి రాజాసింగ్, మనోహర్‌సింగ్‌లను తీసుకొని సంఘటనా స్థలానికి వచ్చారు.

గుమాస్తా విక్రంసింగ్‌ను తీవ్రంగా గాయపర్చిన నలుగురు వ్యక్తులు 7కిలోల బంగారం, 7కిలోల వెండి, రూ.42లక్షల నగదును దోచుకువెళ్లినట్లు శ్యాం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పశ్చిమ ఏసీపీ సుధాకర్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలు దోపిడీ సంఘటనకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నారు.

నగర పోలీస్ కమిషనర్ బి.శ్రీనివాసులు, డీసీపీ విక్రాంత్ పాటిల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ విభాగం వారు సంఘటనా స్థలం నుంచి వేలిముద్రలు సేకరించారు.

**కేసులో పురోగతి**

కేసు నమోదు చేసిన గంటల వ్యవధిలోనే పోలీసులు పురోగతి సాధించారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన విక్రమ్ సింగ్‌పై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితమే అతడు దుకాణంలో గుమస్తాగా చేరినట్లు యజమానులు చెబుతున్నారు.

## సుప్రీం తీర్పును గౌరవించాలి : రఘురామ

దిల్లీ: న్యాయ వ్యవస్థను గౌరవించని ప్రభుత్వ వ్యవస్థకు ఫుల్‌స్టాప్ పెడదామని నరసాపురం వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికైనా సీఎం జగన్ సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ని తిరిగి ఎస్‌ఈసీగా నియమించాలని కోరారు. కోర్టు తీర్పు మేరకు రమేష్ కుమార్‌ను నియమిస్తే వచ్చే నష్టం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేస్తూ రమేష్‌కుమార్ తీసుకున్న నిర్ణయం సరైన నిర్ణయమని ప్రజలు గమనించారని గుర్తు చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదన్నారు.

"ప్రభుత్వానికి సూచన చేయడమే నా తప్పా?.. ముఖ్యమంత్రి గారూ. 22 మంది ఎంపీలను మీకు అప్పగిస్తాం.. రఘురామకృష్ణరాజుపై అనర్హత వేటు వేయాలని దిల్లీ వచ్చి వేడుకున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా అత్యంత మెజార్టీతో ఎన్నికైన ప్రభుత్వం మనది. పక్కనున్నవారి మాటలు విని సీఎం జగన్ ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవద్దు.

రాజ్యాంగం పట్ల కనీస అవగాహన లేని కొద్దిమంది నా మీద ఫిర్యాదు చేస్తే ఏమౌతుంది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధి గొంతు నొక్కేస్తారా?. ఇది రాచరికం కాదు.. ప్రజాస్వామ్య దేశం. న్యాయస్థానాలను గౌరవిద్దాం..

న్యాయవ్యవస్థ విలువను కాపాడదాం" అని రఘురామకృష్ణరాజు అన్నారు.

## సమయం

### 'మనసు విరిగితే అంతే!'

శరీరానికి గాయాలైతే మానిపోతాయి. మనస్సుకు గాయమైతే మానదు. కఠినమైన మాటలు మాట్లాడితే మనస్సు గాయపడుతుంది. మనస్సు అత్యంత సున్నితమైనది. ఏ సందర్భంలోనూ ఎవ్వరి మనస్సునూ నొప్పించకుండా మసలుకోవాలి. మనసు విరిగితే కష్టం. నేడు జనులలో మానసిక సమస్యలు ఎక్కువైయ్యాయి. తమను ఎవరూ పట్టించుకోవడం లేదనో, తన మాటను ఎవరూ వినడం లేదనో ఇలా అనేక కారణాలతో మనుషులు దూరమవుతున్నారు. ఆర్థికపరమైన విషయాలలో భార్య, ఇతరులు మాట్లాడే మాటల వలన కూడా చాలామంది మనస్సు వికలమై కృంగిపోతున్నారు. మనసు అనేది లోహం కాదు. అది విరిగితే మళ్ళీ అతుకలేం. మానవ సంబంధాలు బాగా పలుచబడుతున్న ఈ రోజుల్లో ఆత్మీయులు దొరకడమే అరుదు. అలా లభించినవారి మనస్సును బాధపెట్టకుండా జాగ్రత్తగా మసలుకోవాలి. లేకపోతే ఈ లోకంలో ఏకాకిగా మారవలసి వస్తుంది. ఒంటరితనం వలన మానసిక సమస్యలు తలెత్తి జీవితాన్ని ఛిద్రం చేస్తాయి. ఎదుటివారి మనస్సును గాయపరచడం తప్పు అంటూ ఒక శతకకవి ఇలా వ్రాశాడు.

'ఇనుము విరిగెనేను యిరుమారు ముమ్మారు
కాచి యతకవచ్చు క్రమముగాను
మనసు విరిగెనేని మరియంట నేర్చునా
విశ్వదాభిరామ వినురవేమ'

...కవితా రచన
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

| మాసం : శ్రావణ; తిథి :పంచమి ప.2.24; ఉత్తర సా.5.23; రా.వ.1.12ల 2.42. | శనివారం 25-07-2020 |
|---|---|

**మేషం** : వ్యాపారభివృద్ధికి చేపట్టిన పథకాలు, ప్రణాళికలు మెరుగైన ఫలితాలనిస్తాయి.ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్థత్వం అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. ఉద్యోగ విరమణ చేసిన వారికి రావలసిన ప్రతిఫలాలు అందుతాయి. సమావేశానికి ఏర్పాట్లు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. పొదుపు ఆవశ్యకతను గుర్తిస్తారు. **వృషభం** : ఉద్యోగస్తులు సమర్థంగా పని చేసి అధికారులను మెప్పిస్తారు. వృధా ఖర్చులు తగ్గించుకోవాలన్న మీ యత్నం ఫలించదు. స్త్రీలకు పుట్టింటి వారి ఆదరణ, ఆకస్మిక ధనప్రాప్తి వంటి శుభ సంకేతాలున్నాయి. యాధృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. ప్రయాణాలలో పరిచయం లేని వ్యక్తులతో మితంగా సంభాషించండి. **మిథునం** : కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు చికాకులు తప్పవు. నిరుద్యోగులు ఇంటర్వ్యూల్లో విజయం సాధిస్తారు. పత్రికా, వార్తా సంస్థల్లోని వారికి ప్రగతితో కూడిన అవకాశాలు లభిస్తాయి. మీ సంతానం పై చదువుల కోసం బాగా శ్రమిస్తారు. ఉపాధ్యాయులకు మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. **కర్కాటకం** : తలపెట్టిన పనుల్లో స్వల్ప ఆటంకాలెదురవుతాయి. ఆపద సమయంలో బంధు మిత్రులు అండగా నిలుస్తారు. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదని గమనించండి. విద్యార్థులకు హడావుడి, క్వారీ కాంట్రాక్టర్లకు ఊహించని ఆటంకాలెదురవుతాయి. మీ బ్యాంకు పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. **సింహం** : స్వర్ణకారులు, బంగారు వ్యాపారులకు పనివారలతో చికాకులు తప్పవు. ఇతరులకు పెద్ద మొత్తంలో ధన సహాయం చేయడం మంచిది కాదు. సంఘంలో మీ మాటకు మంచి పేరు, ఖ్యాతి లభిస్తుంది. ఇసుక, క్వారీ కాంట్రాక్టర్లకు ఊహించని ఆటంకాలెదురవుతాయి. బ్యాంకు వ్యవహారాలలో చికాకులు తప్పవు. **కన్య** : కార్యసాధనలో అనుకున్నది సాధించి మీ సమర్థతను నిరూపించుకుంటారు. విద్యార్థులకు కోరుకున్న కోర్సులలో ప్రవేశం లభిస్తుంది. ఎంతో కొంత పొదుపు చేయాలన్న మీ ఆలోచన ఫలిస్తుంది. మీ ఉన్నతిని చాటుకోవాలనే ఉద్దేశ్యంతో ధనం విరివిగా వ్యవయం చేస్తారు. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేస్తారు. **తుల** : రాబడికి మించిన ఖర్చులుంటాయి. కపటం లేని మీ ఆలోచనలు, సలహాలు మీకు అభిమానుల్ని సంపాదించి పెడుతుంది. రైతులు వ్యవసాయ రుణాల విత్తనాల కోసం ఆందోళన చెందుతారు. నిర్మాణ పనులు, గృహ మరమ్మతులలో పెరిగిన వ్యయం ఆందోళన కలిగిస్తుంది. రవాణా రంగాల వారికి చికాకులు తప్పవు. **వృశ్చికం** : స్పెక్యులేషన్ రంగాల వారి అంచనాలు నిరుత్సాహ పరుస్తాయి. కొన్ని సందర్భములందు ధన నష్టము సంభవించును. స్త్రీలకు అర్జన, విలాస వస్తువుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. వ్యాపారాభివృద్ధికి చేపట్టిన ప్రణాళికలు, పథకాలు మున్ముందు మంచి ఫలితాలనిస్తాయి. మీ శక్తిసామర్థ్యాలు ఎదుటివారు గుర్తిస్తారు. **ధనుస్సు** : కోర్టు వ్యవహారాలు, ఆస్తి తగాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆరోగ్యంలో తగు జాగ్రత్తలు అవసరం. మీ వాహనం ఇతరులకివ్వడం మంచిది కాదని గమనించండి. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనాలను ఫలిస్తాయి. వాయిదా పడిన మొక్కుబడులు తీర్చుకుంటారు. ప్రయాణాల లక్ష్యం నెరవేరుతుంది. **మకరం** : ఉద్యోగస్తుల దైనందిన కార్యక్రమాల్లో మార్పులుండవు. వృత్తులు చిరు వ్యాపారులకు అన్ని విధాలా కలిసి రాగలదు. ఇంట మీ మాటకు వ్యతిరేకత ఎదురవుతుంది. ఇతరుల విషయాలకు దూరంగా ఉండటం క్షేమదాయకం. ప్రముఖులను కలుసుకుంటారు. ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. **కుంభం** : ప్రయాణాల వలన అధిక ధన వ్యయమవుతుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులు అనుకూలిస్తాయి. వాహనములను కొనుగోలు చేస్తారు. నూతన వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించండి. భార్యా భర్తల మధ్య అన్యోన్యత లోపిస్తుంది. బంధువుల నుంచి ఒత్తిడి మొహమ్మాటాలు ఎదుర్కొంటారు. **మీనం** : వాణిజ్య ఒప్పందములకు అనువైన కాలం. పట్టుదలతో శ్రమించి అనుకున్న పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి రావలసిన బెనిఫిట్స్ అందుతాయి. విద్యార్థులకు టెక్నికల్, కంప్యూటర్ సెన్స్‌లో ప్రవేశం లభిస్తుంది. వృత్తుల వారికి ఎంత శ్రమించినా ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటుంది.

# సాయిబాబా చిన్న కథలు

సంకీర్తన



### నిజమైన స్నేహితుడెవరు?

ఆ ఇరువురి మధ్య వుండే ప్రగాఢమైన మైత్రిని అనుబంధాన్ని ప్రశంసించాడు. పితియన్‌ను క్షమించమే గాక, వారిరువురిని తన కొలువులో చేర్చుకున్నాడు. మైత్రి అంటే ఇటువంటి మైత్రి వుండాలి. మిత్రులు దేహాలు వేరైనా ప్రాణాలు ఒక్కటి అని గుర్తించి వర్తించాలి.

### క్షమాగుణము

ఒక దేశపు రాజు తాను కాలినడకతో కొంత దూరం నడవవలసినప్పుడు తన కాలికి ముళ్ల గుచ్చుకుని బాధపెట్టడం గమనించి, ఆ బాధ నివారణకు ఒక ఉపాయం ఆలోచించాడు. తన పరివారములో కొందరితో "మీరు మన రాజ్యపు వీధులు మరియింక మిగతా మార్గములలో వుండే ముళ్ళనంతా ఏరిపార వేయండి" అని ఆజ్ఞాపించాడు. ఆ ఆజ్ఞను విన్న అతని మంత్రి రాజుయొక్క అజ్ఞానానికి విచారిస్తూ, కొంత సేపయిన తరువాత రాజుతో "రాజా! ఈ విధంగా ముళ్ళను ఏరిపారవేయడానికి ఎంతమందిని పంపుతున్నామో అందమందికీ ఏదో కొంత వేతనమివ్వాలి కదా. ఈ విధంగా ఏరిపార వేస్తే ముళ్లు లేకుండా పోవు. అవి ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ మొలుస్తుంటాయి ఇది అంతులేని శ్రమ అవుతుంది" అన్నాడు. "అయితే ఏమి చెయ్యాలి?" అని ప్రశ్నించాడు రాజు. "రాజా! మీరు ఒక జత చెప్పులను కుట్టించుకోండి. అవి మీ పాదములను ముళ్ల బారినుండి రక్షిస్తాయి." అన్నాడు. ఈ కథయొక్క అంతరార్థాన్ని స్వామి ఈ విధంగా వివరించారు. చెప్పులు ఏ విధంగా ఒక వ్యక్తి పాదములను ముళ్లు గ్రుచ్చుకోకుండా రక్షిస్తాయో, అటులనే ప్రేమతో నిండిన హృదయము, ఒక వ్యక్తికి తగిలే నింద నిష్ఠూరములతో కూడిన కఠినోక్తులను తట్టుకునే శక్తిని ప్రసాదిస్తుంది. అదే క్షమాగుణము.

### దేశాభిమానం

సుభాష్ చంద్రబోస్ కలకత్తా యూనివర్శిటీలో చదువుకున్నాడు. ఒక రోజు ఒక ఆంగ్ల అధ్యాపకుడు భారత దేశాన్ని, భారతీయులను గురించి హేళనగా అలక్ష్యంగా మాట్లాడాడు. సుభాష్ తన మాతృ దేశ దూషణమును వినలేక పోయాడు. అతడు దేశాభిమాని. కొంతసేపే ఓర్చుకున్నాడు. ఇక ఉండలేక డెస్క్ మీదుగా ఎగిరి ఆ లెక్చరర్ తలను పట్టుకుని తన చెప్పుతో బాగా కొట్టాడు. "దేనినైనా నేను సహిస్తాను. నా మాతృ దేశాన్ని దూషించడం నేను సహించలేను. నన్ను ఏ విధంగా శిక్షించినా సరే నా దేశమును అవమాన పరిచిన వానికి బుద్ధి చెప్పి తీరవలసిందే" అన్నాడు . విద్యార్థులందరూ ఏమీ చెయ్యలేకపోయారు. లెక్చరర్ "హెల్ప్ మీ.. హెల్ప్ మీ.." అని అరిచాడు. ఎవ్వరూ సహాయము చెయ్యలేదు.ఈ వార్త యూనివర్శిటీ అధికారులకు తెలిసింది. ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టుకుని 5 సంవత్సరాల వరకు సుభాష్ కలకత్తా యూనివర్శిటీలో చదవడానికి వీల్లేదని తీర్మానం చేశారు. సుభాష్ ఈ చర్యను లెక్క చేయలేదు. చదువును దేశం కోసం త్యాగం చేశాడు.



# వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ హోమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆల యంలో శుక్రవారం చండీ హోమము ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం,అమ్మవారికి మూల, మంత్ర జపములు, సప్తపతి పారాయణములు నిర్వ హించారు. 11 గం.లకు పూర్ణ హుతి గావించారు.పూజా కార్య క్రమాలను దేవులపల్లి.ప్రసాద్, చెళ్ళపిళ్ళ.ప్రసాద్ శర్మ, కూచి బొట్ల.ప్రసాద్ మరియు వేద పండి తులు, అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఈరంకి జగన్నాధ రావు, ఏసి రమేష్ బాబు, సూపరింటెండెంట్ లక్ష్మణస్వామి ఆలయ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు. వేద పండితుల వేద ఆశీర్వాదములు అనంతరం తీర్ధ ప్రసాదములు అందజేశారు.

## ద్రోణంరాజు శశి శ్రీనివాస్ అందించిన 'రామాయణం' పూర్తైన సందర్భంగా ఘనంగా అన్నదానం

**'వాల్మీకి రామాయణం' ఆలకించినంతనే 'కోటి జన్మల పుణ్య ఫలం'**



విశాఖపట్నం : ద్రోణంరాజు శశి శ్రీనివాస్ అందించిన..వాల్మీకీ రామా యణం నేటితో పూర్తైంది. ఈ సందర్భంగా..శ్రీ స్వామి వివేకానంద సేవా సంస్థలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రామా యణంలో ప్రతీ ఘట్టం కూడా సర్వమానవాళికి.. ఆదర్శనీయమని సంస్థ కార్యదర్శి వాసుపల్లి ఉమాదేవి వ్యాఖ్యానించారు.

వాల్మీకీ రామా యణాన్ని ఎంతో అద్భుతంగా, అందరికీ అర్ధమయ్యేలా విపులంగా వివరించిన ద్రోణంరాజు శశి శ్రీనివాస్ కు ఆమె పాదాభి వందనాలు తెలియ జేశారు. ప్రతీరోజు రామాయణ ప్రవచ నాలను ఆలకించి నంతనే.. కోటి జన్మల పుణ్యఫలం లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 25న శ్రీ సీతారాముల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆంజనేయ స్వామి ఆలయానికి అప్పగించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ అన్నదాన సేవా కార్యక్రమంలో సంస్థ మహిళా సభ్యులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కరెంట్‌షాక్ తో యువకుడు మృతి



మృతుడు రాజు (ఫైల్ ఫోటో)

లంకెలపాలెం : గ్రేటర్ విశాఖ 85 వ వార్డు లంకెలపాలెం కు చెందిన పిల్లా నూకరాజు (40) కరెంట్ షాక్ తో మృతి చెందాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... మృతుడు నూకరాజు స్థానికంగా లారీ షెడ్డులో ఎలక్ట్రీషియన్ గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## యానాంలో 107కి చేరిన కరోనా పాజిటివ్ కేసులు

యానాం : నియోజకవర్గంలో శుక్రవారం నమోదైన 24 పాజిటివ్ కేసులతో 107కి చేరినట్లు ప్రాంతీయ పరిపాలన అధికారి శివరాజ్ మీనా విలేఖర్లకు తెలిపారు .కొత్తగా నమోదైన ప్రాంతాలు జి.ఎం.సి.బాలయోగి నగర్ 3 ,ఓల్డ్ రాజీవ్ నగర్2,బెజవాడ స్ట్రీట్ 3, ,గిరి యాంపేట 2,పిల్లా రా య 2, అయ్యన్న నగర్ 1,గోపాల్ నగర్ 1,కామరాజ్ నగర్ 1,కొత్తపేట 1,సుబ్రహ్మణ్య భారతి వీధి 1,ఫెర్రీ రోడ్డు 1,చింతా వారి వీధి 1,సిద్ధార్థ నగర్ 1,సావిత్రి నగర్ 1,ద్రాక్షారామం రోడ్డు 1,త్యాగరాయ వీధి 1,విష్ణాలయం వీధి 1చొప్పున నమోదు అయ్యాయి అన్నారు. ఈ ప్రాంతాలలో కొన్ని ఇప్పటికే కంటెంట్మెంట్ జోన్లు చేశామని మిగిలిన కొత్త ప్రాంతాలను కంటోన్మెంట్ జోనల్ గా చేసే విధంగా సంబంధిత అధికారులు ఆదేశించినట్లు తెలిపారు.ఈ ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టి ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు .ఈ 107మందిలో ఇద్దరు మృతి చెందారని,45మంది వైరస్ నుండి కోలుకొని డిశ్చార్జ్ అయ్యారని ,60 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు .వైరస్ నివారణ కొరకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు ..మెట్టుకూరు హై స్కూల్ ,పరం పేట ఆరోగ్య ఉప కేంద్రం హాయ్ సొల్యూషన్ కేంద్రాలకు ఉపయోగించి ఉన్నట్లు తెలిపారు.

## రాష్ట్రంలో కరోనా విలయ తాండవం.... నిర్మూలించడంలో ప్రభుత్వం విఫలం

-రాష్ట్ర తెదేపా ప్రధాన కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు



నిరసన తెలుపుతున్న దృశ్యం

గాజువాక :రాష్ట్రంలో, విశాఖ,గాజువాకలో కరోనా విలయ తాండవం చేస్తున్న, దాన్ని నిర్మూలించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని, దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అవగాహన రాహిత్యం మే అని రాష్ట్ర తెదేపా ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రభుత్వం పై మండి పడ్డారు. శుక్రవారం గాజువాక తెదేపా పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తెదేపా ముఖ్య నేతలతో కలిసి మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కారోన ఉధృతంగా ఉన్న సందర్భంగా అగ్గిలో ఆజ్యం పోసినట్లు మద్యం షాపులను తెరిచి కారోన మరింత ఉదృతంగా మారడానికి కారణం అయ్యిందని దుయ్యపెట్టారు. వెంటనే ప్రభుత్వం మద్యం షాపులను నిషేధించాలని డిమాండ్ చేశారు. కారోన మాహమ్మారి వలన సుమారు 780 మంది మరణించడమే కాకుండా సుమారు 60 వేల మంది కరోనా వ్యాధితో తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చెప్పారు. పెళ్లికి 20 మంది చావుకు 30 మందికి మాత్రమే అనుమతి ఇస్తూ మద్యం దుకాణాలకు మాత్రం వేలాది మంది రోడ్లపై సామాజిక దూరం పాటించకుండా కరోనా వ్యాప్తికి కారణం అవుతున్నారని ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా వ్యాధితో మరణించిన వారికి 50 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతం అయిన గాజువాకలో రోజురోజుకి కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్య ఆధునిక వసతులతో కూడుకున్న కోవిడ్-19 టెస్టింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ వైద్య పరీక్షలు అందించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి ప్రసాధుల శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పుచ్చా విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు మొహమ్మద్ రఫీ, వార్డ్ అధ్యక్షులు గంటా అబ్బాయి, గోమాడ వాసు, జాజుల గంగరాజు, మొల్లి ముత్యాలు నాయుడు, మహిళ నాయకులు కాకి స్వరూప రెడ్డి, సీనియర్ నాయకులు ఇంధల హరికృష్ణ, యలమంచిలి పైడిరాజు, నగేష్, వాసు, పంపాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులు అరికట్టండి

**- రాష్ట్ర ప్రభుత్వాన్ని జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ ని జాతీయ మానవ హక్కుల సంఘాన్ని కోరిన రాష్ట్ర కాంగ్రెస్**

**- ప్రియతమ నేత డాక్టర్ సాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు విశాఖలో నిరసన**

విశాఖపట్నం : సమాజంలో రోజురోజుకీ పెరిగిపోతున్న దళితులపై దాడులను అవమానాలను అరికట్టాలని దీనికోసమే జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి తగు మార్గ నిర్దేశకాలు జారీ చేయాలనిమరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని దళితులకు సామాజిక భద్రత కల్పించాలని అమాయక దళితులపై దాడులు చేసిన వారిని శిక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఎ.నారాయణ రావు హెచ్చరించారు. రాష్ట్ర పిసిసి అధ్యక్షులు సాకే శైలజానాథ్ ఆదేశాల ప్రకారం శుక్రవారం ఆంధ్రప్రదేశ్ దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా విశాఖలో నిరసన కార్యక్రమం బ్యానర్ ప్రదర్శన జరిగినది.రాష్ట్ర ప్రభుత్వం లో ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని దళితుల హక్కుల కాపాడాలని లేదా వారి పదవులకు రాజీనామా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ కాంగ్రెస్ ఇంఛార్జ్ కోవిడ్-19 గుత్తుల శ్రీనివాసరావు, టి.వాసుదేవరావు దళిత సీనియర్ కాంగ్రెస్ నాయకులు కస్తూరి వెంకట్రావు టీచర్స్ అసోసియేషన్ మురళీకృష్ణ స్కాలర్ అసోసియేషన్ శ్యామసుందర్ నాయుడు, ఎం.లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం పరిశుభ్రతపై దృష్టి సారించాలి



గొలుగొండ : వర్షాలు పడుతున్న నేపథ్యంలో సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పారిశుధ్యం పరిశుభ్రతపై దృష్టిసారించాలని గొలుగొండ ఈవోపిఆర్డి లాలం సీతయ్య సూచించారు. గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులతో పారిశుధ్ధ్యం పరిశుభ్రతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పక్షోత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు విస్తృతంగా గ్రామంలో పర్యటిస్తూ పారిశుధ్ధ్యం పరిశుభ్రతను పరిశీలించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడం వల్ల తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేం దుకు సభలు సమావేశాలు ర్యాలీలు నిర్వహించాలన్నారు. తడి చెత్త పొడి చెత్తను ఎప్పటికప్పుడు గ్రామాల నుంచి సంపద తయారుచేసే కేంద్రాలకు తరలించారని అన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మెరుగుపర్చాలి

**కొయ్యూరు ఎంపిడిఒ మేరీరోజ్**



మాట్లాడుతున్న ఎంపిడిఒ మేరీరోజ్

కొయ్యూరు : గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని కొయ్యూరు ఎంపిడిఒ మేరీరోజ్ అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో పరిశుభ్రత పక్షోత్సవాల్లో భాగంగా సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కరోనాకి తోడు సీజనల్ వ్యాధులు ప్రబలతున్న నేపధ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణం, కల్వర్టుకు రూ.5.10కోట్లు



పరిశీలిస్తున్న దృశ్యం

కొయ్యూరు : కొయ్యూరు మండలం మర్రిపాలెం నుండి జోగుంపేట వరకు తారురోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రూ.5.10కోట్లు మంజూరు అయింది. ఈ మేరకు శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ ఈశ్వరరావు, కాంటాక్టర్ లగుడు సత్తిబాబు, వైసిపి జెడ్పీటీసీ అభ్యర్ధి వారా నూకరాజులు ప్రక్రియను పరిశీలించారు. ఆగస్టు మొదటి వారంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎంపి గొడ్డేటి మాధవి, నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్, అనకాపల్లి ఎంపి సత్యవతిచే శంకుస్థాపన కార్యక్రమాలు చేపడతామన్నారు.

## మైనర్ బాలికపై ఆత్యాచారం చేశారని తల్లిదండ్రులు ఫిర్యాదు

**స్పందించిన ఎస్సై సురేష్‌కుమార్**



కోటఉరట్ల : మండల కేంద్రంలో శ్రీ విధ్వాన్ కాన్వెంట్ లో ఒక బాలికపై ఆత్యాచారం చేసి గర్భం చేసారని అ బాలిక యొక్క తల్లిదండ్రులు పోలీసులకు పిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై సురేష్ కుమార్ స్పందించి అనుమానుతులను అదుపు లోకి తీసుకున్నారు.శుక్రవారం నర్సీపట్నం ఎఎస్పీ తుసీన్ సిన్హా కోటఉరట్ల పోలీసు స్టేషన్ కి సందర్శించి ఈ కేసులో ఎవరు ఎవరు బాగస్వాముల అయి ఉన్నారు అని విచారణ చేశారు. నర్సీపట్నం ఎఎస్పీ తుసీన్ సిన్హా మాట్లాడుతూ శ్రీ విధ్వాన్ కాన్వెంట్ లో ఈ మైనర్ బాలిక గత మూడు సంవత్సరాలు కిందటి నుండి చదువుతుంది.ఈ కాన్వెంట్ ను హరినాద్ అను వ్యక్తి నడిపిస్తున్నాడు ఇదే పాఠశాలలో వర్క్ గా నూకలక్ష్మి ఆమె పని చేస్తున్నది ఈమె కాన్వెంట్ ప్రధానోపాధ్యాయులు హరినాద్ తో సన్నిహితంగా ఉంటూ విద్యార్థులను హరినాద్ కు పరిచయం చేసి సన్నిహితంగా ఉండేటట్లు చేసేది.హరినాద్ ఈ మైనర్ బాలికతో రజస్వల ముందు రజస్వల తరువాత స్వీట్ చాక్లెట్ లు ఇచ్చి తన వైపు లోబర్చుకున్నాడు.తరువాత నూకలక్ష్మి ఆమె ఈ మైనర్ బాలికకు పిన్ని వరుస అవుతుంది. హరినాద్ ను కాకుండా కోటఉరట్ల గ్రామానికి చెందిన జవ్వాది శివశంకర్ కి ఈ మైనర్ బాలికను పరిచయం చేసింది కూడా ఈ పిన్ని వరుసకు అయ్యే ఈ నూకలక్ష్మి యే.ప్రస్తుతం జవ్వాది శివశంకర్ పరారీలో ఉన్నాటు తెలిపారు. శ్రీ విధ్వాన్ కాన్వెంట్ ప్రధానోపాధ్యాయులు హరినాద్ మా అదుపులో ఉన్నాడు అని తెలిపారు. తదుపరి విషయంను విచారణ చేసి మరి కొద్దిగా రోజుల్లో పత్రిక విలేకరులకు తెలియజేస్తామని తెలిపారు. ఈ విచారణలో నర్సీపట్నం ఏఎస్పీ తూసీన్ సిన్హా నర్సీపట్నం రూరల్ సిఐ అప్పలనాయుడు కోటఉరట్ల ఎస్సై సురేష్ కుమార్ ఉన్నారు.

# పెదనందిపల్లి కౌలు రైతుల గుర్తింపు గ్రామసభ




దేవరాపల్లి : అర్హులైన కౌలు రైతుల అందరికీ ప్రభుత్వం కౌలు పంట హక్కు పత్రం మంజూరు చేస్తామని మండల వ్యవసాయ అధికారి ఎం. వాసుదేవరావు అన్నారు. శుక్రవారం పెదనందిపల్లి గ్రామం లో ఆర్ బి కె లో కౌలు రైతు గుర్తింపు గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కౌలు రైతు మంజూరు పత్రం ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చని అలాగే ప్రభుత్వం అందజేసిన రాయితీలు వర్తిస్తాయని అందువల్ల అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ కౌలు మంజూరు పత్రానికి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కిరణ్ కుమార్, రైతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పట్టుబడ్డ 150 లీటర్ల నాటుసారా



యానాం : నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామమైన సావిత్రి నగర్ బస్ షెల్టర్ వెనుక చెత్తలో కప్పి ఉంచిన 150 లీటర్ల నాటుసారాను శుక్రవారం హాస్టల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు .ఏ ఎస్ ఐ జనిపెల్ల సత్యనారాయణ కథనం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం సావిత్రి నగర్ బస్ షెల్టర్ వెనుక చెత్తతో కప్పిన 75 లీటర్ల టిన్నులు 2 ఉన్నాయని పోలీస్ స్టేషన్ కు సమాచారం రావడంతో దాడి చేసి 2 టిన్నులలో గల 150 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ,పట్టుబడిన 150 లీటర్ల నాటుసారా ను ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కు అప్పగించినట్లు తెలిపారు ..

# దేవరాపల్లిలో విజ్రంభిస్తున్న కరోనా

- మండలంలో 13 కేసులు నమోదు - భయాందోళనలో మండల ప్రజలు
- తాజాగా చిననందిపల్లిలో మరో పాజిటివ్



దేవరాపల్లి : మండలంలో కరోనా కేసులు విజ్రంభిస్తున్నాయి. దేవరాపల్లి, వేచలం పి హెచ్ సి పరిధిలో శుక్రవారం నాటికీ 13 కేసులు నమోదయ్యాయి. అందులో 10 కేసులు యాక్టివ్ కాగా 3 కేసులు డిశ్చార్జ్ అయినట్లు వేచలం వైద్యాధికారి బి. హారిక తెలిపారు. ఇటీవల వేచలంలో 7 కేసులు నమోదు అవ్వగా శుక్రవారం చిననందిపల్లిలో 23 ఏళ్ళ యువకుడికి పాజిటివ్ నిర్ధారణ అయినట్లు వైద్యులు తెలిపారు. ఈ యువకుడు ఈ నెల 9న హైదరాబాద్ నుంచి నేరుగా చిననందిపల్లి గ్రామానికి రావడంతో అతడిని హోమ్ క్వారెంటెన్లో ఉంచారు. ఈ నెల 19న టెస్ట్ చేయగా శుక్రవారం ఉదయం పాజిటివ్ గా నమోదైనట్లు వైద్యాధికారి బి. హారిక తెలిపారు. అదే విధంగా దేవరాపల్లి పి హెచ్ సి పరిధిలో ఐదు కేసులు నమోదయ్యాయి. వరస కేసులు నమోదు కావడం పట్ల మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం దేవరాపల్లిలో 10 రాపిట్ కిట్ జన్ టెస్ట్ లు చేయగా 10 నెగటివ్ రావడంతో వైద్య సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. దేవరాపల్లిలోని మూడు ప్రాంతాల్లో, చిననందిపల్లి రామకోవెల వీధిలో అధికారులు కంటెన్మెంట్ జోన్ గా ప్రకటించారు.

# కరోనా వ్యాప్తి నివారణకు ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలి




విజయనగరం : కరోనా వ్యాధి వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలని, కరోనా లక్షణాలు ఉన్నట్లైతే తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా పరీక్ష చేయించుకోవాలని, బహిరంగ ప్రదేశాలలో తప్పనిసరిగా మాస్క్ ధరించాలని, వ్యక్తుల మధ్య భౌతిక దూరం పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విజయనగరం జిల్లాఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి తే. 24-07-2020 ది, శుక్రవారం నాడు పిలుపునిచ్చారు. లాక్‌డౌన్ అమలవుతున్న తీరును పరిశీలించేందుకుగాను జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి విజయనగరం పట్టణంలో ఆర్టీసి కాంప్లెక్సు, ఉల్లివీధి, కన్యకాపరమేశ్వరి కోవెల, దాసన్నపేట, రింగురోడ్డు, ప్రాంతాలను మరియు డెంకాడ మండలం మోదవలస చెక్ పోస్టును పరిశీలించి, భద్రతను పర్యవేక్షించి, కోవిడ్ 19 నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించాల్సిన విధులు గురించి ఆదేశాలు ఇచ్చారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ - ప్రజలు కరోనా వ్యాప్తి నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలని, అత్యవసరమైతే తప్ప అనవసరంగా బయట తిరగవద్దని, కరోనా లక్షణాలు జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి వంటివిఉంటే స్వచ్ఛంధంగా, విజయనగరం ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో కరోనా పరీక్షలుచేయించుకోవాలని, కుటుంబ సభ్యుల శ్రేయస్సు దృష్ట్యా వ్యాధి నిర్ధారణ ఫలితం వచ్చేవరకు కుటుంబ సభ్యులను, ఇతరులెవరినీ కలవకుండా స్వీయ నియంత్రణ పాటించి కరోనా వ్యాధి వ్యాప్తిని అరికట్టాలన్నారు. కరోనా పాజటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఇతర ప్రాంతాల నుండి ఎవరైనా కొత్తవ్యక్తులు వస్తే స్థానిక పోలీసులకు గాని, రెవెన్యూ అధికారులకు గాని సమాచారమివ్వాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది కరోనా నియంత్రణకు అవగాహన కార్యక్రమాల ద్వారా పట్టణాలలో, గ్రామాలలో కరోనా వ్యాధి వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నారని జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి తెలియజేశారు. ప్రజలు విజయనగరం జిల్లాలో స్వచ్ఛందంగా లాక్‌డౌన్ పాటించేందుకు ముందుకు రావడంతోలాక్‌డౌన్ నిబంధనలు పటిష్టంగా అమలయ్యే విధంగా చూడాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. లాక్‌డౌన్ నిబంధనలు అమలులో ఉన్నందున ఉదయం 11 గం॥లకు షాపులు మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసుఅధికారులును జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజలంతా సహకరించి, స్వచ్ఛందంగా లాక్‌డౌను నిబంధనలను పాటిస్తే, కరోనాను అదుపు చెయ్యవచ్చునని జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి అన్నారు.

# సిఎం జగన్ అన్నకు కృతజ్ఞతలు తెలిపిన బొంది అచ్చిబాబు



పరవాడ: అంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు జగన్ మొహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన మాటప్రకారము మత్స కారులుకు ప్రత్యేకహోదా కల్పిస్తాను అన్న మాటకు మాటతప్పకుండా మడమతిప్పకుండా నిలిచారు . అనడములో ఎటువంట ిసందేహములేదు. ఇటీవలే శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం నుండి మత్సకారుల ముద్దుబిడ్డ డా''సిదిరి అప్పలరాజుకు కెబినిట్ లో రాష్ట్రమత్స్యశాఖ,పశుసంవర్ధికపాడ ిపరిశ్రమ శాఖ మంత్రివర్యులుగా అవకాశము కల్పించి ఇచ్చినమాట నిలబెట్టికున్నారు. ఇటువంటి బహుత్తరమైనమంత్రిపదవిని మత్స్యకార్లుకు కట్టబెట్టినందుకుగానూ ముఖ్యమంత్రి జగన్ మొహన్ రెడ్డికి పరవాడ వైసిపి మండలఉపాధ్యక్షులు బొంది అచ్చిబాబుప్రత్యేక కృతజ్ఞతలు తెలియపరిచారు.

# గోవిందమ్మ కాలనీలో చోరీ

చోడవరం ': చోడవరం శివారు అంకు పాలెం పంచాయతీ గోవిందమ్మ కాలనీలో గురువారం రాత్రి 96 వేల రూపాయల నగదు చోరీ జరిగినట్లు చోడవరం పోలీసులు తెలిపారు. కాలనీకి చెందిన కె. గౌరీ శంకర్ తమ ఇంటిలో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తుండగా ఇంటిలో డ్రెస్సింగ్ టేబుల్ సొరుగులో దాచి ఉంచిన నగదును దుండగులు చోరీ చేసినట్లు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ ఐ డి లక్ష్మీనారాయణ సిబ్బందితో కలసి వెళ్లి చోరీ జరిగిన తీరును బాధిత కుటుంబ సభ్యులు అడిగి తెలుసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

# కరోనా చికిత్సకు వెళ్ళినా.. సహాయాన్ని అందించడం ఆపలేదు



విజయనగరం: 2వ పట్టణ పోలీసు స్టేషనులో పని చేస్తున్న మహిళా కానిస్టేబులు డి. రాధిక కోవిడ్ చికిత్స నిమిత్తం మిమ్స్ ఆసుపత్రిలో చేరినప్పటికీ, నలుగురికి సహాయపడాలనే లక్ష్యాన్ని, సేవ చేయాలనే తపనను విడవలేదు. విజయనగరం పట్టణ ప్రజలకు కోవిడ్ 19 పట్ల అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ శ్రీమతి బి.రాజకుమారి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కరోనా అవగాహన బృందంలో సభ్యురాలుగా ఉండి, ప్రజలకు అవగాహన కల్పించడంలో ముందుండేవారు. ప్రతిరోజూ ప్రజలకు చేరువగా విధులు నిర్వహించడంతో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ కోవిడ్ 19వైరస్ ప్రభావానికి గురయ్యారు. తీవ్రమైన అనారోగ్య సమస్యతో ఇటీవలనే జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి చొరవతోఅర్ధరాత్రి మిమ్స్ ఆసుపత్రిలో కోవిడ్ చికిత్స నిమిత్తం చేరారు. ప్రస్తుతం, రాధిక మిమ్స్ ఆసుపత్రిలో కరోనా వ్యాధికి చికిత్స పొందుతున్న, ఆమె మంచానికి ప్రక్కనే విజయనగరం పట్టణానికి చెందిన డి. గోదాదేవి అనే 80 సం॥లకు పైబడిన వృద్ధురాలు చికిత్స నిమిత్తం చేరారు. ఆమె వృద్ధాప్యంతో తన పనులును తాను చేసుకోలేని పరిస్థితిలో ఉండేది. అంతేకాకుండా, ఎవరి సహాయం లేకుండా భోజనం, టిఫిన్ కూడా తినే పరిస్థితి ఉండేది కాదు. ఇది గమనించిన,

మహిళా కానిస్టేబులు రాధిక వృద్ధాప్యంలో ఉన్న ఆ మహిళకు ప్రతీ రోజూ సహాయ పడుతూ, ఆమెకు భోజనం, టిఫిన్ తినిపించడంతోపాటు, ఇతర పనుల్లోను కూడా సహాయపడుతూ ఉండేది. కరోనా వ్యాధి ప్రభావంతో ఒకరి వద్దకు ఒకరు వెళ్ళేందుకే విముఖత చూపిస్తూ, మానవత్వం మరిచి పోతున్న ప్రస్తుత రోజుల్లో, వృద్ధురాలికి సహాయంగా నిలుస్తున్న మహిళా కానిస్టేబులు సేవలను వార్డులో ఉన్న ఇతర పేషంటులు ప్రశంసిస్తూ, జిల్లా ఎస్పీగార్కి ఫోటోను పంపారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి మహిళా కానిస్టేబులు రాధిక సేవలను ప్రశంసించంతోపాటు, నలుగురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

# గజపతినగరంలో పైప్‌లైన్ లీకేజీ

- వృధాగా పోతున్న తాగునీరు - పట్టించుకోని అధికారులు



చోడవరం : మండలంలోని గజపతినగరం గ్రామపంచాయతీ సమీపంలోని రేషన్ డిపో వద్ద పైప్ లైన్ లీకేజీతో తాగునీరు వృధాగా పోతుంది . సుమారు నెల రోజుల నుంచి ప్రజలకు అవసరమైన నీరు పోతున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. పంచాయతీ సిబ్బంది తక్షణం చర్యలు తీసుకొని పైప్ లైన్ లీకేజీ మరమ్మతు పనులు చేపట్టాలని గ్రామస్తులు పలువురు కోరుతున్నారు.

# కనకదుర్గమ్మ అమ్మవారు ఆలయంలో విశేష పూజలు



చోడవరం - పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో గల కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పసుపుకుంకుమలతో విశేష పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక స్వయంభు విఘ్నేశ్వర స్వామి ఆలయంలో బహుళ చవితి పురస్కరించుకొని లక్ష్మీ గణపతి హోమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలో కరోనా ఉద్ధృతి తీవ్రంగా ఉండటంతో కేవలం అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

# జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఈబి దాడులు దాడులు

- స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అదనపు ఎస్పీ ఎన్. శ్రీదేవీరావు




విజయనగరం : స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో ఆధ్వర్యంలో జిల్లాలో సీతానగరం, పూసపాటిరేగ, ఎస్.కోట, కొత్తవలస, గరివిడి పోలీసు స్టేషన్ల పరిధిలలో దాడులు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 01 ట్రాక్టరు, 59 క్వార్టరు బాటిల్లు మద్యం, 350 నాటుసారా పాకెట్లు, 3 కిలోల గంజాయి పట్టుకొన్నట్లుగా, 4 డ్రమ్ముల నాటుసారా, 70 లీటర్లు బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్లుగా ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు శుక్రవారం తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి ఆదేశాలతో ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్.శ్రీదేవీరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, ఎస్.ఈ.బి సిబ్బందితో దాడులు నిర్వహించినట్లుగా ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్.శ్రీదేవీరావు తెలిపారు. సీతానగరం పి.ఎస్. పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 01 ట్రాక్టరును స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినారు. పూసపాటిరేగ పి.ఎస్ పరిధిలో 26 క్వార్టరు బాటిల్లు మద్యం, ఒక మోటారు సైకిలు స్వాధీనం చేసుకొని, ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, దర్యాప్తు చేపట్టినారు. ఎస్.కోట పి.ఎస్ పరిధిలో, బడ్డవర చెక్‌పోస్టు వద్ద 03 కిలోల గంజాయి, ఒక మోటారు సైకిలు స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినారు.కొత్తవలస పి.ఎస్. పరిధిలో, రామలింగాపురం గ్రామంలో 4 డ్రమ్ముల నాటుసారాను ధ్వంసం చేశారు. గరివిడి పి.ఎస్ పరిధిలోనాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 70 లీటర్లు బెల్లం ఊటులు ధ్వంసం చేశారు. ఎస్.కోట పి.ఎస్ పరిధిలో, బడ్డవర చెక్‌పోస్టువద్ద అక్రమంగా తరలిస్తున్న 23 మద్యంబాటిల్లును ఎస్ఈబి సిబ్బంది స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, తదుపరి చర్యలు నిమిత్తం ఎస్.కోట పి.ఎస్కు అప్పగించినారు. బొబ్బిలి పి.ఎస్ పరిధిలో, పాతబబ్బిలి గ్రామంలో 350 నాటుసారా పాకెట్లు స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు.ఈ దాడుల్లో ఎస్ఈబి అధికారులు, సిబ్బంది, మరియు స్థానిక పోలీసులు పాల్గన్నారని ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు తెలిపారు.

# నాడు-నేడు పేరుతో బాహాటంగా దోపిడీ

## వీడియోలీక్‌తో అవినీతి బట్టబయలు



అనకాపల్లి : ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన నాడు-నేడు పథకం అనకాపల్లిలో పక్కదారి పడుతుందని చాలా కాలంగా విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం నుండి మంజూరైన నిధులతో నాణ్యమైన పనులు జరగాల్సి ఉండగా అధిక శాతం ఈ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయి. అభివృద్ధి పనులను పర్యవేక్షించి, నిధులు పక్కదారి పట్టకుండా చూడాల్సిన విద్యా కమిటీయే అక్రమాలకు తెర తీసింది.గవరపాలెం జీవియంసి బాలికల ఉన్నత పాఠశాలకు సంబంధించి విద్యా కమిటీ సమావేశమై అభివృద్ధి పనుల గురించి చర్చించకుండా తమ వాటాల గురించి కొట్లాడుకోవడం, దీనికి ఒక అజ్ఞాత వ్యక్తి వీడియో తీయడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ పాఠశాలలో జరిగిన పనులలో ఏమాత్రం నాణ్యత లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ పాఠశాలకు 34 లక్షలు మంజూరయ్యాయి. వీటితో డైనింగ్ హాలు నిర్మాణం, ఎలక్ట్రికల్ వైరింగ్, గ్రిల్స్ తదితర పనులు చేపట్టాలి. లేబర్ వర్క్‌ను లక్షా పదివేలకు తనకు ఇస్తే కమీషన్ పదివేలు ఇస్తానని సభ్యుల్లో ఒకరు చెప్పారు. ఇందుకు రెండవ వర్గం నిరాకరించింది. 25 వేలు ఇవ్వాలంటూ డిమాండ్ చేసింది. అలా అయితే లక్షా పది వేలను లక్షా 25వేలకు పెంపు చేస్తే మీరు అడిగింది ఇస్తామని మొదటి వర్గం చెప్పింది. దీనిపై ఇరు వర్గాల మధ్య వాదులాట మొదలైంది. ఈ వాటాల విషయమై జరిగిన కొట్లాట కాస్తా బయటకు పొక్కడంతో శుక్రవారం జీవియంసి డిప్యూటీ డిఈవో డి.శ్రీనువాస్, మండల విద్యాశాఖాధికారి డి.దివాకర్ విచారణకు వచ్చారు. స్కూల్ ప్రధానోపాధ్యాయునితో పాటు ఇతర ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికార్లు నిర్వహించిన ఈ సమీక్షకు స్కూల్ కమిటీ సభ్యులు డుమ్మా కొట్టడం విశేషం. అధికార్లు నిర్వహించిన సమీక్షలో ఈ పాఠశాలలో పనులు సరిగా జరగడం లేదని, విద్యా కమిటీయే అభివృద్ధికి అడ్డు తగులుతుందని తేలింది. ఈ కమిటీని తక్షణం రద్దు చేసి, వీరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. స్కూలు కమిటీతో కాకుండా అధికారులే ఈ స్కూలు పనులను దగ్గరుండి పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ఈసమావేశంలో జీవీఎంసీ ఎస్. సుమిత్ర, స్కూల్ ప్రధానోపాధ్యాయులు బ్రహ్మానందం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ కమిటీ నా..... కమిషన్ల కమిటీ నా...

## ధ్వజమెత్తిన వైసీపీ నాయకుడు



అనకాపల్లి : స్థానిక గవరపాలెంలోని జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాల హైస్కూల్ లో ఉన్న స్కూల్ కమిటీని తక్షణమే రద్దు చేయాలని కమీషన్ల దండుకున్న అంశంలో నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టి అందుకు కారకులైన వారిపై చర్యలు చేపట్టాలని వైసీపీ నాయకుడు పొలిమేర నాయుడు డిమాండ్ చేశారు శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన నాటి నుండి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పైన దృష్టి సారించారని అందుకోసం ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రారంభించారు అన్నారు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల తయారుచేసి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో చేస్తున్న కార్యక్రమాలు ప్రతిపక్షానికి మింగుడు పడడం లేదని అందులో భాగంగా స్థానిక గవరపాలెం లోని హైస్కూల్ల గత టీడీపీ ప్రభుత్వం ఎన్నిక కాబడిన స్కూల్ కమిటీ పాఠశాల నాడు నేడు కార్యక్రమాల్లో భారీగా అవినీతికి పాల్పడి నాసిరకమైన పనులు చేస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని ప్రయత్నాలు చేశారని దానికి ప్రధానోపాధ్యాయులు బ్రహ్మానందం సహకరించక పోవడంతో అతనిపై కుట్రలు చేసే విధంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు ఈ అంశాలన్నీ స్థానికంగా ఉన్న తన దృష్టికి రావడంతో గతంలో జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకు వెళ్లాలని ఆయన వచ్చి పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించి వెళ్లడం జరిగింది అన్నారు.

పాఠశాల వ్యవస్థాపకులు గా తన పాఠశాలలో తప్పు జరిగితే ఉపేక్షించబోమని నిష్పక్షపాతంగా పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు కావాలనే ఇరికించాలని కుట్రలో భాగంగా వీడియోలు విడుదల చేయడం జరిగిందన్నారు. జరిగిన, జరుగుతున్న సంఘటనలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని అలాగే స్కూల్ కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు.

# కరోనా వచ్చినా భయపడరాదు



కాకినాడ : కరోనా వైరస్ సోకినా భయపడకుండా హెూమ్ క్వారంటైన్ లో ఉంటూ మందులతోపాటు వంటింటి చిట్కాలు పాటిస్తే అతి త్వరగా కోలుకుంటారని ఆయుర్వేద వైద్యులు రమేష్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సు ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వైద్యులు ఇచ్చే మందులతోపాటు తులసి ఆకులు వేసిన వేడి నీళ్లను నాలుగైదు సార్లు తాగాలి అన్నారు. ఉదయం పరగడుపున రాత్రి పడుకోబోయే ముందు పాలల్లో పసుపు, మిరియాల పొడి వేసి తాగాలి అన్నారు. రోజుకు రెండుసార్లు వేడి నీళ్లలో పసుపు, వెల్లుల్లి వేసి ఆవిరిపట్టాలి అన్నారు. గొంతులో ఇన్ఫెక్షన్ తగ్గడానికి వేడి నీటిలో ఉప్పు వేసి ఆ నీటితో పుక్కిలించాలి అని అన్నారు. వంటల్లో పసుపు, జీలకర్ర, బెల్లం, తాజా నిమ్మరసం అధికంగా వినియోగిం చాలన్నారు. డ్రై ఫ్రూట్స్, గుడ్లు, తాజా ఆకు కూరలు అధికంగా తీసుకోవాలన్నారు.

రోజు ఉదయం, సాయంత్రం యోగ, ధ్యానం చేయాలన్నారు. మనలో రోగనిరోధక శక్తి ఉంటే యాంటీవైరస్ కణాలు కొత్తగా వచ్చిన వైరస్ కణాలను తొలగిస్తాయి అని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

# లోక్‌సభ మాజీ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ జయంతి (జూలై25)



సోమనాథ్ ఛటర్జీ భారతీయ రాజకీయ నాయకుడు. అతను ఒక దశాబ్దం (2008-2018) వరకు ఏ పార్టీకి చెందని స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నప్పటికీ, తన జీవితంలో ఎక్కువ కాలం కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) తో సంబంధం కలిగి ఉన్నారు. ఈయన 2004 నుండి 2009 వరకు లోక్‌సభ స్పీకర్ గా పనిచేసారు. ఈయన అసోం లోని తేజ్‌పూర్ లో జన్మించారు. సోమనాథ్ తండ్రి నిర్మల్ చంద్ర ఛటర్జీ స్వాతంత్ర్యోద్యమ కాలంలో న్యాయవాది, మేథావి, హిందూ పునరుజ్జీవనవాది, జాతీయవాది. తల్లి బినపాని దేవి. సోమనాథ్ ఛటర్జీ మిత్రా ఇనిస్టిట్యూషన్ స్కూల్, ప్రెసిడెన్సీ కళాశాల, తరువాత కలకత్తాలోని కలకత్తా విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించారు. కేంబ్రిడ్జ్ లోని జీసస్ కాలేజీలో చదివారు. 1952 లో బిఎ, 1957 లో ఎం ఏ డిగ్రీలతో పట్టభద్రుడయ్యారు. 2007లో న్యాయశాస్త్రంలో కళాశాల గౌరవ ఫెలోషిప్ పొందారు. లండన్ లోని మిడిల్ టెంపుల్ నుండి న్యాయవాద సంఘంలో చేరి, క్రియాశీల రాజకీయాల్లో చేరడానికి ముందు కలకత్తా హైకోర్టులో న్యాయవాదిగా న్యాయ ప్రాక్టీసు తీసుకున్నారు. సోమనాథ్ ఛటర్జీ 1973 నుండి 2008 వరకు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) (సిపిఐ (ఎం)) లో సభ్యునిగా ఉన్నారు. 1971 లో తండ్రి మరణం కారణంగా జరిగిన మధ్యంతర ఎన్నికలలో ఆ నియోజకవర్గంలో నామినేట్ అభ్యర్థిగా నామినేట్ అయ్యారు. 1971 లో లోక్‌సభ సభ్యునిగా ఎన్నికయ్యారు. సిపిఐ (ఎం) మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా మొదటిసారి ఎన్నికయ్యారు. 1984 లో జాదవ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గంలో మమతా బెనర్జీ చేతిలో ఓడిపోయినప్పుడు తప్ప, తొమ్మిది సార్లు తిరిగి ఎన్నికయ్యారు. 1989 నుండి 2004 వరకు లోక్‌సభలో తన పార్టీకి నాయకునిగా వ్యవహరించారు. సిపిఐ (ఎం) కోటగా పరిగణించబడుతున్న బోల్పూర్ లోక్‌సభ నియోజకవర్గం నుండి 14 వ లోక్‌సభ సభ్యుడిగా 2004 లో పదవ సారి ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల తరువాత, అతను ప్రొటెమ్ స్పీకర్‌గా నియమించబడ్డారు. తరువాత 2004 జూన్ 4 న 14 వ లోక్‌సభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గణేష్ వాసుదేవ్ మావ్లంకర్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండవ ప్రొటెమ్ స్పీకర్ గా చరిత్రలో నిలిచారు. 2008 మధ్యలో యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ నేతృత్వం లోని ప్రభుత్వానికి సిపిఐ తన మద్దతును ఉపసంహరించుకుంది. ఈ సమయంలో స్పీకరుగా ఉన్న తాను పక్షపాత రహితంగా ఉండవలసి ఉన్నప్పటికీ ప్రభుత్వం నుండి తమ మద్దతును ఉపసంహరించుకుంటున్న పార్లమెంటు సభ్యుల జాబితాలో ఛటర్జీ పేరును చేర్చారు. అయినప్పటికీ, ఛటర్జీ 2008 జూలైలో జరిగిన విశ్వాస పరీక్ష కోసం జరిగిన ఓటింగ్ ప్రక్రియలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి తన పార్టీ మార్గాన్ని అనుసరించడానికి ఇష్టపడలేదు. ఎందుకంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడం అంటే మితవాద ప్రతిపక్ష బిజెపితో పాటు కలసి ఓటు వేయడం. పార్టీ సూచనలను విస్మరించి, విశ్వాస ఓటు సమయంలో తాను సమర్థతో వ్యవహరిస్తూ సభలో స్పీకర్‌గా తన పదవిలో ఉండాలని నిర్ణయించుకున్నారు. 2008 జూలై 23 న ప్రభుత్వం ఓటింగ్ లో గెలిచి తన మనుగడ సాగించిన తరువాత, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు సిపిఐ (ఎం) అతన్ని పార్టీ నుండి బహిష్కరించింది. సిపిఐ (ఎం) పత్రికా ప్రకటనలో, "కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా-మార్క్సిస్ట్ యొక్క పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమనాథ్ ఛటర్జీని పార్టీ సభ్యత్వం నుండి తక్షణమే బహిష్కరించాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ చర్య " బెంగాల్ కార్యదర్శి బిమాన్ బోస్ మాట్లాడుతూ "చటర్జీ భారత రాజ్యాంగం ప్రకారం వ్యవహరించి ఉండవచ్చు, కాని పార్టీ సభ్యుల విషయంలో పార్టీ రాజ్యాంగం అత్యున్నతమైనది" అని అన్నారు. ఛటర్జీ ప్రకారం, బహిష్కరణ అతని జీవితంలో "అత్యంత విచారకరమైన రోజులలో ఒకటి". పక్షపాత రహిత స్థితిని పొందడానికి స్పీకర్ కార్యాలయంలో పనిచేస్తున్నప్పుడు భవిష్యత్ స్పీకర్లు తమ పార్టీలకు రాజీనామా చేయాలని అతను సూచించాడు. 1996 లో సోమనాథ్ చటర్జీ అత్యుత్తమ పార్లమెంటరీ పురస్కారాన్ని గెలుచుకున్నారు .2013 లో, అతను ప్రతిష్టాత్మక భారత్ నిర్మాణ అవార్డులలో లివింగ్ లెజెండ్ అవార్డును అందుకున్నారు. చటర్జీ 1950 ఫిబ్రవరి 7 న లాల్గోలాలోని జమీందారీ కుటుంబం లోని రేణు ఛటర్జీని వివాహం చేసుకున్నాడు ఈ దంపతులకు కుమారుడు ప్రతాప్, ఇద్దరు కుమార్తెలు అనురాధ, అనుశిల ఉన్నారు. ప్రతాప్ ఛటర్జీ కలకత్తా హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నాడు. సోమనాథ్ ఛటర్జీ ఆర్థిక సమగ్రతకు ప్రసిద్ధి చెందాడు. 2004 లో స్పీకరుగా అతను 20 అక్బర్ రోడ్ వద్ద ఉన్న అధికారిక నివాసంలోకి వెళ్ళినప్పుడు, అతను జాతీయ ఖజానా నుండి టాయిలెట్, టీ కోసం చెల్లించే పద్ధతిని నిలిపివేశారు. విదేశాలకు వెళ్ళేటప్పుడు అతనితో పాటు కుటుంబ సభ్యుల ఖర్చులను తానే భరించాడు. రాజకీయాలలో ఎంతో నిబద్ధత తో వ్యవహరించిన సోమనాథ్ చటర్జీ 2018 ఆగస్టు 13 న మరణించారు.

# పోడు భూముల హక్కుల పత్రాల కోసం గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ : గొలుగొండ మండలం సాలిక మల్లవరం పంచాయతీ పొగచెట్లపాలెం గ్రామంలో...

రెవెన్యూ అధికారులు శుక్రవారం పోడు భూముల హక్కు పత్రాల కోసం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, విలేజ్ రెవెన్యూ అధికారి పడాల్ పాల్గొన్నారు.

# మానసిక స్థైర్యానికి మించిన మందు లేదు : డీఐజీ



విజయనగరం : కరోనా నుంచి బయట పడేందుకు మానసిక స్థైర్యాన్ని మించిన మందు లేదని, ఎవరూ అధైర్యపడవద్దని విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎల్‌కేవీ రంగారావు భరోసా ఇచ్చారు. జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తూ కరోనా బారిన పడి జయించి, తిరిగి విధులకు హాజరైన పలువురు పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా కరోనా నుంచి కోలుకున్న పోలీసులకు ఎండు ఫలాలు, శానిటైజర్లు, మాస్కులు అందజేశారు. కరోనా బారిన పడుతున్న పోలీసుల రక్షణకు రేంజ్ పరిధిలో సీఐని నియమించినట్లు చెప్పారు.

# 'చేయూత'కు 2,46,194 మంది దరఖాస్తు

కాకినాడ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్లలోపు పేద మహిళలకు వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా ఆర్థిక సాయం అందించడానికి దరఖాస్తు స్వీకరణ గడువు ముగిసింది. నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.18,750 చొప్పున రూ.75 వేలు ఆర్థిక సాయం అందించడానికి ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జిల్లాలో ఈ పథకానికి 2,46,194 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో బీసీలు 1,58,300, ఎస్సీలు 67,071, ఎస్టీలు 14,901, మైనారిటీలు 5,922 మంది ఉన్నారు. సచివాలయాల ద్వారా వచ్చిన దరఖాస్తులపై ఎప్పటికప్పుడు సామాజిక తనిఖీ నిర్వహించి 13,792 మందిని అనర్హులుగా గుర్తించారు. దరఖాస్తుల గడువు ముగిసిందని, రాష్ట్రంలో దరఖాస్తులు ఎక్కువ వచ్చిన వాటిలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్ తెలిపారు.

# ప్రకృతి సోయగం.. హొయలొలికే జలపాతం



బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం మారుమూల కామవరం అడవిలో ఉన్న గుబ్బల మంగమ్మ గుడి వద్ద ప్రకృతి కనువిందు చేస్తోంది. చుట్టూ పచ్చని చెట్లతో నిండిన ఎత్తైన కొండల నడుమ ఒక రాతి గుహలో ఆ గుడి ఉంది. గుడి పైభాగం మీద నుంచి జలపాతంలా నీరు జాలు వారుతోంది.

కురిసిన వర్షానికి ఆ ప్రదేశం మరింత సుందరంగా మారింది. కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ ప్రారంభం నుంచి దర్శనాలు నిలిపివేశారు.

కరోనా కట్టడి అయ్యేంత వరకు దర్శనాలను రద్దు చేశామని, భక్తులు గమనించి రాకుండా సహకరించాలని గుడి కమిటీ ప్రతినిధులు కోరారు.

# పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి

బాల్కొండ : మండల పరిధిలోని కిసాన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జడ్పీటీసీ సభ్యురాలు దాసరి లావణ్య శుక్రవారం ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం ప్రభుత్వం పలు సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు అందిస్తోందని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో తెరాస నాయకులు దాసరి వెంకటేశ్, ఎం.నాగభూషణం, ప్రధానోపాధ్యాయుడు సాయన్న, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో విద్యార్థులకు ఎంఈవో రాజేశ్వర్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో తెరాస నాయకులు గోవర్ధన్ గౌడ్, ఎస్ఎంసీ ఛైర్మన్ రామరాజు, ఉపాధ్యాయులు నర్సారెడ్డి, భృగు మహర్షి తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీల్లో ప్రవేశాల దరఖాస్తులకు గడువు పొడిగింపు

గుంటూరు : జిల్లాలో ఉన్న 24 కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో(కేజీబీవీ) 2020- 21 విద్యాసంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు...

గడువు పొడిగించినట్లు సమగ్ర శిక్ష అదనపు సమన్వయ కర్త పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందు నిర్ణయించిన ప్రకారం ఈనెల 24వ తేదీలో గడువు పూర్తికానుండగా, దీన్ని ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

దరఖాస్తులు https://apkgbv. apcfss.in వెబ్‌సైట్‌లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. పేద, అనాథ, బడిబయట పిల్లలు, డ్రాపౌట్ (మధ్యలో బడి మానేసిన వారు) బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎంపికైన విద్యార్థినుల వివరాలు ఫోన్ మెసేజ్ ద్వారాగాని, సంబంధిత పాఠశాలల నోటీస్ బోర్డుల్లో, https://ssa.ap. gov.in/ssa వెబ్‌సైట్‌లో వెల్లడిస్తారన్నారు. ఏవైనా సమస్యలు, సందేహాలుంటే 90002 04930, 95028 77357 నెంబర్లకు సంప్రదిం చాలని సూచించారు.

# భాష, సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

- ఈ రెండింటినీ విడదీసి చూడలేం - ప్రపంచంలో తెలుగువారు ఎక్కడున్నా అందరమూ ఒక్కటేనన్న భావనను ప్రతిబింబించాలి
- ఈ దిశగా తానాతో సహా పలు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న కృషికి అభినందనలు
- కరోనా నేపథ్యంలో సామాజిక దూరం, ఆరోగ్యకర సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండండి
- 'ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవాల' ప్రారంభోత్సవంలో గౌరవ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ : భాష, సంస్కృతులు ఒకదానితో ఒకటి అవినాభావ సంబంధాన్ని కలిగి ఉంటాయని.. వీటికి విడదీసి చూడలేమని గౌరవ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఇలాంటి తల్లిభాషను, సంస్కృతిని కాపాడుకోవడంతోపాటు, తర్వాతి తరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలిపారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో జరుగుతున్న 'ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవాల'ను ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. 'మానవ సంబంధాల అభివృద్ధి క్రమంలో ఏర్పడిన భావ వ్యక్తీకరణే భాష. వివిధ చారిత్రక, సామాజిక, ఆర్థిక, భౌగోళిక కారణాల వల్ల వ్యక్తీకరణ అనేక రకాలుగా జరుగుతుంది. భాషలో కేవలం వ్యక్తీకరణే గాక, మన సంస్కృతి కూడా దాగి ఉంటుంది' అని పేర్కొన్నారు. మన భాష అంటే మాట్లాడే నాలుగు మాటలు మాత్రమే కాదని.. మన సంస్కృతిని నింపుకున్న మాతృభాష ప్రతి ఒక్కరి ఇంటి భాష కావాలన్నారు. 'వ్యక్తిని మోక్షం దిశగా నడిపించే ఒక ఆధ్యాత్మిక మార్గం మతం. ఆ లక్ష్యం దిశగా మనిషిని ముందుకు తీసుకు వెళ్ళే జీవన విధానానికి సాధనంగా నిలిచే ఆచరణాత్మక మార్గదర్శి సంస్కృతి. భాష.. ఈ సంస్కృతిలోని అంతర్భాగం. అందుకే భాషను, సంస్కృతిని విడదీసి చూడలేము' అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రతి నాగరికత గొప్పదనం వారి భాష ద్వారానే వ్యక్తమవుతుందన్న ఉపరాష్ట్రపతి.. మన ఆటలు, మాటలు, పాటలు, సంగీతం, సాహిత్యం, కళలు, పండుగలు, పబ్బాలు, సామూహిక కార్యక్రమాలు, వ్యాపార లావాదేవీలన్నీ భాష లేకుండా పెంపొందలేవన్నారు. 'భాష సమాజాన్ని సృష్టించి.. జాతిని బలపరుస్తుంది, అభివృద్ధికి మార్గం వేస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధి ప్రజా ఉద్యమంగా రూపుదాల్చాల్సిన అవసరం ఉందని.. దీనికోసం ముందుగా తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్ గురించి ఆలోచించాలన్నారు. 'ఇతర భాషలు నేర్చుకోవడం, ప్రావిణ్యత సాధించడం తప్పు కాదు. ఎవరైనా, ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు. ఆ విషయంలో ఆకాశమే హద్దు. కానీ మాతృభాషను, మాతృమూర్తిని మరచిపోకూడదు. అందుకే భాషాభివృద్ధి కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. అది తల్లిదండ్రుల బాధ్యత, గురువుల బాధ్యత, అన్నింటికీ మించి ఎవరికి వారే అమ్మ లాంటి మాతృభాష కోసం ముందుకు కదిలి కాపాడుకోవలసిన బాధ్యత' అని ఉపరాష్ట్రపతి అన్నారు.

ఈ కార్యక్రమాన్ని ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవాలనడం కంటే.. 'ప్రపంచ తెలుగు సాంస్కృతిక తిరునాళ్లు' అనడం సముచితంగా ఉంటుందని ఉపరాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. చిన్నప్పుడు ఊళ్లలో జరిగే తిరునాళ్లతో మన సంస్కృతిని తెలుసుకునే అవకాశముండేదని.. అదే రీతిలో ఇప్పుడు జరుగుతున్న కార్యక్రమం.. భవిష్యత్ తరాలు తెలుగుభాష, సంస్కృతి ప్రాశస్త్యాన్ని తెలుసుకుని, వీటిని నేర్చుకునేందుకు అవకాశాన్ని కల్పిస్తాయి కాబట్టి ఈ ఉత్సవాలను తిరునాళ్లు అంటే బాగుంటుందన్నారు. భాష, సంస్కృతుల అభివృద్ధికి తానాతో సహా పలు తెలుగు సంఘాలు కలిసి చేస్తున్న కృషిని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. 8 అంశాల్లో 23 రకాల పోటీలు (సౌందర్యలహరి, తెలుగు వెలుగు, రాగమంజరి, నాదామృతం, అందెల రవళి, కళాకృతి, రంగస్థలం) నిర్వహించటం, మన సంస్కృతిని ప్రతిబింబించేలా వాటికి పేర్లు పెట్టడం చాలా చక్కని ఆలోచనన్నారు. రాష్ట్రం, దేశం అనే తేడా లేకుండా ఎల్లలు దాటి తెలుగు వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న అనేక తెలుగు సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆహ్వానించదగిన పరిణామమని ఉపరాష్ట్రపతి అన్నారు. కరోనా నేపథ్యంలో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని.. సామాజిక దూరాన్ని పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని ఉపరాష్ట్రపతి సూచించారు. దైనందిన జీవితంలో యోగ, ధ్యానాన్ని భాగం చేసుకోవాలని, తద్వారా రోగనిరోధక శక్తిని పెంచుకోవాలన్నారు. ఈ ఇబ్బందితో ఆందోళన చెందవద్దని.. కరోనా సమస్యను అధిగమించవచ్చని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీలు సీఎం రమేశ్, గల్లా జయదేవ్, లావు కృష్ణదేవరాయ.. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, తెలంగాణ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, అధికార భాషాసంఘం చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, తానా అధ్యక్షుడు జై తాళ్లూరి, తానా చైర్మన్ అశోక్, కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రావుతోపాటు పలువురు భాషాభిమానులు, ప్రవాస తెలుగువారు పాల్గొన్నారు.

## హ్యాపీ బర్త్‌డే తారక్
## కేటీఆర్‌కు ఏపీ సీఎం వైఎస్ జగన్ శుభాకాంక్షలు



హైదరాబాద్: తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖల మంత్రి, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్)కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ప్రియమైన నా సోదరుడు తారక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆ దేవుడు మీకు ఆరోగ్యాన్ని, అంతులేని సంతోషాలను ప్రసాదించాలి"అని ఆకాంక్షించారు.

ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఇందుకు స్పందించిన కేటీఆర్.. "ధన్యవాదాలు అన్నా" అని బదులిచ్చారు. అదే విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే విడదల రజిని కూడా ట్విటర్ వేదికగా కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో నిమగ్నమై యువతలో స్ఫూర్తి నింపుతున్న మీకు అన్ని సంతోషాలు దక్కాలి అని ఆకాంక్షించారు. కాగా శుక్రవారం కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా రాజకీయ, సినీ ప్రముఖులు, అభిమానుల నుంచి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ మంత్రి, కేటీఆర్ బావ హరీష్ రావు, టీఆర్ఎస్ ఎంపీ జోగినపల్లి సంతోష్, మెగాస్టార్ చిరంజీవి తదితరులు కేటీఆర్‌ను విష్ చేశారు.

## గీతం ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్‌గా ధర్మరాజు



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల (గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) నూతన ప్రిన్సిపాల్ గా ప్రొఫెసర్ సి.ధర్మరాజు నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం నాడు ఆయన భాధ్యతలు స్వీకరించారు. 1985 సంవత్సరంలో ఆంధ్రవిశ్వ విధ్యాలయం నుంచి బంగారు పతకాన్ని పొందిన ధర్మరాజు గత 30 సంవత్సరాలుగా ఇౖజనీరింగ్ విద్యాభోధన లో లెక్చరర్ స్థానం నుంచి ప్రొఫెసర్ స్థానానికి ఎదిగారు.

కమ్యూనికేషన్ రంగంలో విస్తృత పరిశోధనలతో పాటు ఇంజనీరింగ్ పాఠ్య పుస్తకాలను రచించారు. కొంత కాలం ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేశారు.

# కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలి

## రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు





భీమునిపట్నం : చిట్టివలస జ్యూట్ కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు యాజమాన్యాన్ని ఆదేశించారు. చిట్టివలస జ్యూట్ మిల్లు, యాజమాన్యం, కార్మికులతో మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చిట్టివలస జ్యూట్ మిల్లు అగ్రిమెంటు చేసి సంవత్సరకాలం నిన్నటితో పూరైందు వలన మంత్రి సమావేశం నిర్వహించారు. కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు యాజమాన్యం పూర్తిగా చెల్లించాలని, ప్రతికార్మికునికి శాశ్వత, ప్రత్యేక బదిలి, బదిలి, కొత్తగా బదిలి, కార్మీకులకు రూ.27,500/-లు చొప్పున మరియు అప్రంటిసు కార్మికులకు రూ.10,000/-లు చొప్పున ఇస్తానని యజమాన్యం ఒప్పుకున్న ప్రకారం తక్షణమే కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలన్ని వెంటనే చెల్లించాలని జ్యూట్ మిల్లు యజమాని కె.కె. బజోరియాను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో యజమాన్యం ప్రతినిధిలు జోషి, రామ్ కుమార్, ఐక్య కార్యాచరణ కమిటి కార్మిక నాయకులు కె.వరహాలరాజు, చిల్ల వెంకటరమణ, జీరు, వెంకటరెడ్డి, పడాల రమణ వలనకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, కొండపు ఈశ్వరరావు, రామ్ పైడి, మద్దెల దేవుళ్ల, నరవ రామరావు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై అత్యాచారం, దాడులు చేస్తే నిందితులను కఠినంగా శిక్షించాలి

*- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి*



విశాఖసిటీ : రోజురోజుకు రాష్ట్రంలో మహిళలపై పై వరుస దాడులు చేయడం బాధాకరమని ఇలా దళిత మహిళపై దాడి చేయడం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అవమానించినట్టే అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి ఆరోపించారు నిన్న రాజమండ్రి లో ఒక దళిత మహిళ పై 13 మంది అత్యాచారం చేశారంటే ఆ మహిళ ఎంత నరకం అనుభవించిందో రాష్ట్రంలో లో ఒక దళిత మహిళ హెూం మంత్రిగా ఉంటూ దాడులు చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని ఇది వైసీపీ ప్రభుత్వానికి అవమానకరమైన అభిప్రాయపడ్డారు అలాగే మహిళా కమిషన్ చైర్మన్ గా ఉన్న వాసిరెడ్డి పద్మ ఇప్పటివరకు సంఘటనపై స్పందించ లేదు ఈమె గత ప్రభుత్వంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మహిళలపై దాడులు చేస్తే ప్రశ్నించే వ్యక్తి ఈరోజు సంఘటన జరిగి 24 గంటలు అయినా బాధితులను పరామర్శించి పోగా నిందితులపై కఠిన చర్యలు తీసుకోలేదు అని రోజురోజుకీ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది మహిళల రక్షణ కోసం ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు ఎద్దేవా చేశారు ఇప్పటికైనా రాష్ట్ర శాసనసభలో ఉన్న ఎమ్మెల్యేలు మంత్రులు ప్రభుత్వం వదిలివేయకుండా దాడి చేసిన వారిపై కఠిన శిక్ష వేసి మైనర్ బాలికకు న్యాయం చేయాలని రాజమండ్రిలో జరిగిన మైనర్ బాలికపై అత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించి వారిపై ఎస్సీ ఎస్టీ అట్రా సిటి కేసు నమోదు చేసి నిందితులకు ఉరి తీయాలి అప్పుడే మనం మహిళలపై దాడులు జరగకుండా చేయగలమని ప్రభుత్వ ఇప్పటికైనా కళ్లు తెరుచుకొని మహిళలపై దాడులు జరగకుండా ముఖ్యమంత్రి సమక్షంలో ఒక ప్రత్యేక కమిషన్ వేయాలని అభిప్రాయపడ్డారు.

# ఫుడ్ ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించాలి

## ఫుడ్ ప్రాసెసింగ్‌పై సీఎం వైఎస్ జగన్ సమీక్ష



అమరావతి: పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు కష్ట పడకూడదని, సంబంధిత పంటల విషయంలో ఫుడ్ ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దీని కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. వచ్చే సీజన్ కల్లా ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఏర్పాట్లు చేయాలన్నారు. శుక్రవారం ఆయన తాడేపల్లి తన క్యాంపు కార్యాలయంలో ఫుడ్ ప్రాసెసింగ్‌పై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "అరటి, చీనీ, టమోటా రైతులు ప్రతి ఏటా ఆందోళన చెందుతున్నారు. కనీస గిట్టుబాటు ధర రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడాలంటే.. ఎంత మేర కొనుగోలు చేయాలి, ఎంత మేర ఫుడ్‌ప్రాసెసింగ్‌కు తరలించాలన్నదానిపై అధికారులు దృష్టిపెట్టాలని" సీఎం పేర్కొన్నారు. దీని కోసం ఖర్చు ఎంత అయి నా పర్వాలేదు.. కాని సమస్యకు పరిష్కారం ఉండాలని సీఎం జగన్ సూచించారు. "ప్రతి ఏటా అరటి, చీనీ, టమోటా, ఉల్లి, నిమ్మలాంటి రైతులు కష్టాలు పడుతున్నారంటూ కథనాలు వస్తున్నాయి. మళ్లీ ఇలాంటి కథనాలు కనిపించకూడదు. ప్రతి ఏటా ఇలాంటివి పునరావృతం కాకూడదు. మిల్లెట్స్ ప్రాసెసింగ్‌పైన కూడా దృష్టిపెట్టండి. ఫుడ్ ప్రాసెసింగ్‌పై ప్రఖ్యాత కంపెనీలతో టై అప్ చేసుకోవాలి. ఇబ్బందులు వస్తున్న 7-8 పంటలను గుర్తించండి. వాటిని ప్రాసెసింగ్ చేసి... వాల్యూ ఎడిషన్ ఏం చేయగలమో ఆలోచనలు చేయండి. ఈ పంటల ప్రాసెసింగ్ చేయడానికి సంబంధించి ఎక్కడెక్కడ ఏం చేస్తున్నారో తనకు నివేదించాలని" అధికారులను సీఎం జగన్ ఆదేశించారు.

నెలరోజుల్లోగా దీనికి సంబంధించి కార్యాచరణ పూర్తికావాలన్నారు. అవసరమైన చోట్ల ఆర్బీకేల స్థాయిలోనే ప్రాథమిక స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ చేయాలి. మండల స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో అంచనాలు తయారు చేయాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

## కొత్త మంత్రులకు ఛాంబర్లు కేటాయింపు

అమరావతి : నూతన మంత్రులుగా నియమితులైన సీదిరి అప్పలరాజు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు సచివాలయంలో ఛాంబర్ల కేటాయింపు జరిగింది. మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణారావు ఛాంబర్‌ను అప్పలరాజుకు, మాజీమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ ఛాంబర్‌ను వేణుగోపాలకృష్ణకు కేటాయించారు. అలాగే డిప్యూటీ సీఎం, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి శంకర్ నారాయణ పాత ఛాంబర్లనే వినియోగించుకోనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. కాగా పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకట రమణారావు రాజ్యసభకు ఎన్నికకావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గ విస్తరణ జరిపిన విషయం తెలిసిందే.

# గుర్రం జాషువా స్మృతికి రూ.3 కోట్ల నిధులు

## విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



అమరావతి : గుర్రం జాషువా స్మృతికి రూ.3 కోట్ల నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జాషువా సమాధి అభివృద్ధి, ఆడిటోరియం ఏర్పాటు కోసం ఈ నిధులు కేటాయించినట్లు తెలిపారు. విజయవాడ నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, గుంటూరు నడిబొడ్డున జాషువా కళాప్రాంగణం అభివృద్ధికి సీఎం చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 28న జాషువా జయంతి సందర్భంగా తెలుగు అకాడమీ ద్వారా 'సాహిత్య పురస్కారం' ప్రదానం చేస్తామన్నారు. జాషువా గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేసేందుకు సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. సీఎం తీసుకున్న నిర్ణయంపై దళితులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని మంత్రి సురేష్ తెలిపారు.(దళితులపై చంద్రబాబు కపట ప్రేమ)

గుర్రం జాషువాకు నివాళి..

గుర్రం జాషువా 49వ వర్ధంతి సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి విజయవాడ సిటీ ప్రెసిడెంట్ బొప్పన భవకుమార్.. మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్ల చైర్మన్లు నివాళులర్పించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com